

ఫోన్‌లో ప్రజల సమస్యలు వింటూ బుక్‌లో నమోదు చేసుకుంటున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్



శాంతి భద్రతలే.. మా లక్ష్యం

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన

ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

- ట్రాఫిక్ సమస్యల నివారణకు చర్యలు
- ఆవులను రోడ్లపైకి వదిలితే క్రిమినల్ కేసులు
- వాట్సాప్ మెసెజ్‌తో సమస్యల పరిష్కారం

ఫోన్ నెంబరు : 95503 51100

ఏలూరు సబ్ డివిజన్‌లో ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను డీఎస్పీ దృష్టికి తీసుకొచ్చేలా 'ఆంధ్రజ్యోతి' వారధిగా నిలిచింది. డీఎస్పీతో బుధవారం నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను విన్న శ్రావణ కుమార్ ఆయా సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఎస్‌ఐలు, సంబంధిత అధికారులకు అప్పటికప్పుడే ఫోన్‌లోనే ఆదేశాలు జారీ చేశారు.

ఏలూరు/ఏలూరు క్రైం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'ప్రజలకు శాంతిభద్రతలను దగ్గరుండి కల్పిస్తాం. నగరం, మండలాల్లో ట్రాఫిక్ సమస్యను నిలువరించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. దొంగతనాల నివారణకు సీసీ కెమెరాల ఏర్పాటుపై విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం. పోలీసింగ్‌లో సాంకేతికను అమలు చేస్తూ ఈ బిట్స్ విధానంతో చోరీలకు పాల్పడేవారి ఆట కట్టిస్తూ రికవరీలు మెరుగ్గా చేస్తున్నా'మంటూ ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు.

'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమంలో నగరంలో రోడ్ల మలుపులు, ఆస్పత్రి వద్ద రాకపోకలకు అడ్డంగా ఆటోలు, ప్రైవేట్ అంబులెన్స్‌లు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు, వాహనాల నిలుపుదలతో ఎదురవుతున్న ఇక్కట్లపై ప్రజలు గొంతెత్తారు. రోడ్లపై ఆవులను వదలడం వల్ల జరుగుతున్న ప్రమాదాలపై ఫిర్యాదులు చేశారు. డీఎస్పీ స్పందిస్తూ పోలీసులు పరిష్కరించ కలిగే సమస్యలపై తక్షణం ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు సబ్ డివిజన్‌లో ప్రజల సమమ్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు వాట్సాప్ నెంబర్: 95503 51100కు పంపితే సత్వరం చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని డీఎస్పీ వివరించారు. 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌లో వచ్చిన ఫిర్యాలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

ఫోన్ ఇన్‌లో.. వచ్చిన కొన్ని ఫిర్యాదులు..

- తంగెళ్లమూడి దాదా పలావు సెంటర్ వద్ద స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. స్కూల్ బస్సులు మితిమీరిన వేగంతో తిరగడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. ట్రాఫిక్‌ను నిలువరించేలా చర్యలు తీసుకోవాలి

– అబ్దుల్లా, తంగెళ్లమూడి, ఏలూరు

డీఎస్పీ : ఈ సమస్య మా దృష్టికి వచ్చింది. ట్రాఫిక్ సీఐను అక్కడకు పంపించి ఆరా తీయిస్తాం. కానిస్టేబుల్‌ను అక్కడ ఏర్పాటు చేస్తాం. స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేసేలా ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లతాం.

- నగరంలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్ వద్ద రోడ్డుపై పండ్లు, కూరగాయాల బండ్లతో ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడ ఈవ్‌టీజర్లు వేధింపులకు పాల్పడుతున్నారు.

– అంబేద్కర్, ఎన్‌ఆర్‌పేట, ఏలూరు

డీఎస్పీ : అక్కడ నుంచి షాపులను తొలగించే ఏర్పాట్లు చేస్తాం. మీకు ఏమైనా ఈవ్‌టీజర్ల నుంచి సమస్యలు ఎదురైతే 112 నెంబర్‌కు తెలపండి. మా సిబ్బంది వారి ఆటకట్టిస్తారు.

- ఏలూరు అశోక్‌నగర్ బ్రిడ్జి సమీపంలో కండ్రికగూడెం, చింతలపూడి- జంగారెడ్డిగూడెం రోడ్లవైపు స్కూల్ బస్సులను ఇష్టారాజ్యంగా నిలిపేయడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. అక్కడే ఉన్న అవుట్ పోస్టు నిరుప యోగంగా ఉంది. అశోక్‌నగర్ వంతెనపై చేపల, రొయ్యల అమ్మకాలతో ఇబ్బందులు పడుతున్నాం.

– కె.మురళీమోహన్‌రావు, పత్తేబాద

డీఎస్పీ : సమస్య నా దృష్టిలో ఉంది. అక్కడ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఏర్పాటు చేయించి, బస్సులు నిలుపకుండా చర్యలు తీసుకుంటాం. అవుట్‌పోస్టును వినియోగంలోకి తీసుకొస్తాం.

- గణపవరం మండలం కేశవరం వద్ద ఉండి పంటకాల్వ మీద బ్రెయిల్ బ్రిడ్జి అవసానకు దశ చేరి, రెయిలింగ్ రేకులు లేచి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దీనిని కొత్తగా నిర్మించాలి.

– యాళ్ల సుబ్బారావు, కేశవరం

డీఎస్పీ : ఈ సమస్యను ఆర్‌అండ్‌బీ అధికారులతో పాటు, మండలస్థాయి అధికారులు తెలిపి పరిష్క రమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- ఏలూరు పత్తేబాద రైతుబజారు పక్కవీధిలో పాత వేదరాజ్ థియేటర్‌వైపు నో పార్కింగ్ బోర్డులున్నా.. లెక్క చేయకుండా ఇష్టారాజ్యంగా వాహనాలకు రోడ్లకు ఇరువైపులా అడ్డంగా పెడుతున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడి అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు వెళ్లేందుకు సమస్య ఎదురవుతోంది.

– డాక్టర్ వి.రాజేంద్రప్రసాద్, పురపాలకశాఖ రిటైర్డు ఆర్జేడీ, అశోక్‌నగర్

డీఎస్పీ : అక్కడకు స్థానిక ఎస్‌ఐని పంపించి రోడ్లకు అడ్డంగా నిలిపే వాహనాలను సీజ్ చేయిస్తాం.



ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఫిర్యాదు రావడంతో డీఎస్పీ తక్షణం స్పందించి రైతు బజార్ సమీపంలో నో పార్కింగ్ వద్ద ఆటోలను క్లియర్ చేయించిన దృశ్యం



- ఏలూరు ప్రభుత్వాస్పత్రి రెండు ప్రవేశగేట్ల వద్ద, ఫుట్‌పాత్‌లను మూసేస్తూ కొబ్బరిబొండాలు అమ్మేవారు, ఆటోవాలాలు తమ వాహనాలను నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. పేషంట్లను తీసుకెళ్లాలన్న సమస్యగా ఉంది.

– వి.చిన్నా, ఏలూరు

డీఎస్పీ : ఆస్పత్రి గేట్లకు అడ్డం పెట్టే ఆటోలను సీజ్ చేస్తాం. కొబ్బరిబొండాల వ్యాపారులను కొంచెం దూరంగా ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటాం.

- నిడమర్రు మండలంలో బావాయిపాలెం, క్రొవ్విడి, చానుమిల్లి, సిద్ధాపురం ప్రాంతాల్లో రాత్రి వేళ్లలో పోలీస్‌లు గస్తీ లేకుండా ఉండడం వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నాం.

– ముత్యాల వెంకటేశ్వరరావు, నిడమర్రు

డీఎస్పీ : పరిస్థితిని అక్కడి ఎస్‌ఐకు నివేదించి, ఈ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటు చేయిస్తాను.

- ద్వారకాతిరుమల కొండపైకి వెళ్లే టోల్‌గేట్ వద్ద టర్నింగ్ వద్ద కూరగాయాలు, వివిధ పండ్ల హాకర్లు కార్లు ఆపి వాటిని అమ్ముతుండడంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. 15 గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

– కట్టా వెంకట నరసింహారావు(బాబ్జీ). రాళ్లకుంట

డీఎస్పీ : ఈ సమస్యను ద్వారకాతిరుమల ఎస్‌ఐకు తెలిపాం. ఈ రోడ్డుపై ట్రాఫిక్‌ను నిలువరించేలా కానిస్టేబుల్‌ను వెంటనే ఏర్పాటు చేస్తాం.

- గణపవరం మండలం అర్ధవరం ప్రధాన రహదారిపై భారీ గుంతల వల్ల ప్రజలు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

– చిన్నం నాగేశ్వర రావు, అర్ధవరం

డీఎస్పీ : గుంతలకు మర్మతులు చేసేలా ఆర్‌అండ్‌బీ అధికారులకు పరిస్థితిని వివరిస్తాం. రోడ్ల సమస్యలపై ట్రాఫిక్ అడ్వైజరీ కమిటీలో చర్చిస్తాం. ఏదైనా సమస్య ఉంటే 955035 1100కు తెలపండి .

- కైకలూరు మండలం రామవరం ప్రధాన రహదారిపై డీజె సౌండ్స్‌తో నిత్యం ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం.

– ప్రసాద్, రామవరం

డీఎస్పీ : ఇష్టారాజ్యంగా మైక్‌లు, డిజె సౌండ్స్ చేసే వారిపై ఎస్‌ఐ ద్వారా చర్యలను తీసుకుంటాం. చిన్న కార్యక్రమైనా మైక్‌ల ఏర్పాటుకు పోలీస్ అనుమతి తీసుకోవాలి.



కలిదిండి ప్రధాన రహదారిపై సంచరిస్తున్న పశువులు (ఫైల్)

- కలిదిండి మండలం కలిదిండి మెయిన్ రోడ్డు- మార్కెట్ యార్డు వరకు రోడ్ల పైకి ఆవులను ఇష్టారాజ్యంగా వదిలేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. కలిదిండి పెదలంక రోడ్లపై పశుసంచారతో ఇక్కట్లు పడుతున్నాం.

– ఎం.వెంకటేశ్వరరావు సామాజిక కార్యకర్త, బి.పరమేశ్వరరావు, పెదలంక

డీఎస్పీ : ఈ సమస్యను ఇప్పటికే గుర్తించాం. డీఎల్‌పీవోతో మాట్లాడి రోడ్లపై తిరిగే ఆవుల కొమ్ములకు రేడియం పెయింటింగ్ వేయిస్తాం. ఆవుల యజమానులను పిలిపించి వారికి సమస్యను వివరిస్తాం. అప్పటికి యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రిమినల్ కేసులు పెడతాం. కలిదిండి ఎస్‌ఐ స్వయంగా సమస్యను వచ్చి చూసి, పరిష్కరిస్తారు.

- నగరంలోని 31వ డివిజన్ అశోక్‌నగర్ వీరమాచినేని కల్యాణ మండపం రోడ్డు నెంబరు -2 వద్ద ఇష్టానుసారంగా ప్లాట్ల యజమానులను స్పీడ్ బ్రేకర్లను ఎత్తుగా చేసుకోవడం ప్రమాదాల బారిన పడుతున్నారు.

– బిందు మహేశ్వరి, వల్లభనేని సత్యరామ ప్రసాద్, వెంకట శివకుమారి, అశోక్‌నగర్.



డీఎస్పీ : స్పీడ్ బ్రేకర్లు ఎత్తు పెంచుకుని నిర్మించిన వారితోనే వాటిని పగుల గొట్టిస్తాం. అలా చేయని పక్షంలో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి ధ్వంసం చేయిస్తాం. దీనిపై కమిషనర్‌కు వివరిస్తా.

ఇంటర్ పరీక్షలకు.. 1239 మంది దూరం!

- అడ్మిషన్ తీసుకున్న వారిలో 803 మంది ద్వితీయ, 436 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులెక్కడ?
- జిల్లాలో భారీగా డ్రాపవుట్ బాలబాలికలు



ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం బడి ఈడుగల ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా విద్య నభ్యసించాల్సిందే. దీనికనుగుణంగానే ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయి. ఆ మేరకు బడి/కళాశాలలో పేరు నమోదైన విద్యార్థి క్రమం తప్పకుండా తరగతికి హాజరయ్యేలా పర్యవేక్షించడంతో పాటు, ఎవరైనా వరుసగా కొన్నిరోజులు తరగతులకు గైర్హాజరవుతుంటే సంబంధిత బాలబాలికల తల్లిదండ్రులకు ప్రత్యక్షంగా లేదా ఫోన్‌ద్వారా తెలపడం ద్వారా గైర్హాజరీలు లేకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత విద్యాసంస్థ ఉపాధ్యాయులు/అధ్యాపకులు/ ప్రధానోపాధ్యాయుడు/ప్రిన్సిపాల్‌పై ఉంటుందని పలు సందర్భాల్లో ఉన్నతాధికారులు స్పష్టం చేస్తుం టారు. మరో ఎనిమిది రోజుల్లో అంటే మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలకు జిల్లాలో ఏకంగా 1,239 మంది దూరమవుతున్నారు. నిబంధనల ప్రకారం వీరందరినీ మధ్యలో బడి/కళాశాల మానేసిన డ్రాపవుట్లుగా నిర్ధారించడం గమనార్హం. జిల్లాలో 19 ప్రభుత్వ, 80 ప్రైవేటు అన్‌ఎయిడెడ్, 6 సోషల్ వెల్ఫేర్, 3 ట్రైబల్ వెల్ఫేర్, 3 కేజీబీవీలు, 26 హైస్కూల్ ప్లస్ జూనియర్ కళాశాలలున్నాయి. వీటన్నింటిలో మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కావాల్సివున్న థియరీ పరీక్షలకు ప్రథమ సంవత్సరం బాలబాలికలు 18,927 మంది, ద్వితీయ సంవత్సరం 14,170 మంది దరఖాస్తు చేసుకుని హాజరుకావాలి. కానీ థియరీ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 436 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 803 మంది పరీక్ష ఫీజు చెల్లించకపోవడంతో పరీక్షలకు అనర్హులయ్యారు. అంటే వీరంతా డ్రాపవుట్లుగానే భావించవచ్చు. అధికారికంగా జిల్లాలో ఇంటర్‌లో డ్రాపవుట్ల సంఖ్య 1,239గా నిర్ధారించినా అనధికారికంగా 3వేల మందికి పైగానే ఉంటారని సమాచారం. ఆ ప్రకారం ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఆయా కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకున్నవారిలో వివిధ కారణాలతో చదువును మధ్యలోనే నిలిపివేసి వైదొలగిన విద్యార్థులు వేలల్లోనే ఉన్నారని నిర్ధారణ అయింది. ఇపుడు వారంతా ఎక్కడున్నారో? ఏం చేస్తున్నారో?.

కారణాలు ఇవేనా..

ఇంటర్‌కు ట్యూషన్ ఫీజుగా ప్రభుత్వ కళాశాలల్లో ఏడాదికి రూ.వెయ్యిగా నిర్ణయించారు. ప్రైవేటు అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ఫీజులపై పరిమితులు లేవు. ఇక ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల విద్యార్థులందరికీ థియరీ పరీక్షలకు ఫీజుగా రూ.600, ప్రాక్టికల్స్ పరీక్షలకు రూ.275లను ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఫీజులను చెల్లించడం విద్యార్థులకు పెద్దగా ఆర్థికభారం కాదని, డ్రాపవుట్లుగా వైదొలగడానికి ఇతర కారణాలు ఉండవచ్చని అధ్యాపక వర్గాలు భావిస్తున్నాయి. గతంలో విద్యార్థి హాజరు కనీసం 75శాతం ఉంటేనే పరీక్షకు అనుమతించేవారు. దీనిని సడలించి 60 శాతం నుంచి 75 శాతంలోపు వున్న విద్యార్థులు కాండోనేషన్ ఫీజు (అపరాధ/ఆలస్యపు రుసుం) చెల్లిస్తే పరీక్షలకు అనుమతించే వెసులుబాటును కల్పించారు. తాజాగా ఈ కనీస హాజరు పరిమితి 60 శాతాన్ని ఎత్తివేస్తూ, పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతీ విద్యార్థిని పరీక్షలకు అనుమతిం చేందుకు మరింత వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని ఇంటర్‌బోర్డు జిల్లా అధికార వర్గాలు వెలడించాయి. ఆ ప్రకారం 60 శాతం కంటే తక్కువ హాజరున్న విద్యార్థిని సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ రికమెండ్ చేస్తూ ఇంటర్‌బోర్డు కార్యదర్శికి లిఖితపూర్వకంగా అభ్యర్థనను పంపిస్తే పరిశీలించి అనుమతించే అవకాశాలున్నట్టు వివరించాయి. ఇన్ని రకాల వెసులుబాట్లు కల్పించినా జిల్లాలో ఇంటర్ పరీక్షలకు ఏకంగా 1,239 మంది దూరమవుతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రథమ సంవత్సరం పరీక్షల్లో ఎక్కువ సబ్జెక్టుల్లో ఫెయిలై బ్యాక్‌లాగ్‌లు ఉండడం, తదుపరి ద్వితీయ సంవత్సరం సబ్జెక్టులతో పాటే ఆయా బ్యాక్‌లాగ్‌లను పూర్తిచేయాల్సి రావడం, చదువును కొనసాగించడానికి ఆసక్తిలేకపోవడంవంటివి సెకండియర్ పరీక్షల డ్రాపవుట్లకు కారణాలై ఉండవచ్చని భావిస్తున్నారు. ఇక ప్రథమ సంవత్సరం పరీక్షలకు డ్రాపవుట్ల పరిస్థితికి కారణాలను విశ్లేషిస్తే పలువురు కూలీ పనులకు వెళ్లడం, కుటుంబ పరిస్థితులు, పేదరికం తదితర వెనుకబాట్లు అయి ఉండవచ్చని తెలుస్తోంది. వాస్తవానికి ప్రథమ/ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఫెయిలైనవారికి భారం కాకుండా ఫలితాలు ప్రకటించిన కొద్దిరోజుల వ్యవధిలోనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించి తదుపరి పైచదువులకు విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నా పెద్దసంఖ్యలోనే డ్రాపవుట్ విద్యార్థులుండడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

జీబీఎస్‌పై భయాందోళనలు వద్దు

- కలెక్టర్ వెట్రిసెల్వి
- జూమ్ సమీక్షలో సరిగా స్పందించని ముగ్గురు వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు?



జూమ్ కాన్ఫరెన్సులో వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా వైద్యాధికారులు గులియన్ బారే సిండ్రోమ్(జీబీఎస్) వ్యాధిపై ప్రజల్లో ఎటువంటి అపోహలకు తావు లేకుండా విస్తృత అవగాహన కలిగించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం సాయంత్రం పీహెచ్‌సీల వైద్యాధికారులతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో జీబీఎస్, ఇమ్యునైజేషన్, మాతా శిశు మరణాల నివారణ, తదితర వైద్య కార్యక్రమాలపై సమీక్షించారు. జీబీఎస్ అనుమానిత లక్షణాలు గల కేసులను గుర్తించిన వెంటనే తనకు, డీఎంహెచ్‌వోకు, డీసీహెచ్‌ఎస్‌కు తెలపాలని సూచించారు.

వైద్యాధికారులకు మందలింపు

మాతాశిశు మరణాలపై సమగ్ర సమాచారం లేకుండా పాత విషయాలతో సమావేశానికి రావడంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మాతా, శిశువుల రిజిస్ట్రేషన్, ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో గర్భిణులకు డెలివరీలపై పాత గణాంకాలు చెప్పడం సరికాదన్నారు. సమావేశానికి ముందే అన్ని వివరాలను సిద్ధం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినిని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ వైద్యసేవల్లో ప్రీఅథెంటికేషన్‌లో అలసత్వం వహించిన వేలేరుపాడు మెడికల్ ఆఫీసర్‌కు, ఇమ్యునైజేషన్‌లో నిర్లక్ష్యానికి ముదినేపల్లి వైద్యాధికారికి, ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్‌లో లోటుపాట్లకు ఎల్ఎన్‌డీ పేట వైద్యాధికారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్‌సతీష్, డీఐవో డాక్టర్ నాగేశ్వరరావు, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ పాల్గొన్నారు.

నేడు బాదంపూడికి కేంద్ర ఆరోగ్య శాఖ వైద్య బృందాలు ?

బర్డ్‌ఫ్లూ వైరస్‌తో కలకలం రేపిన ఉంగుటూరు మండలం బాదంపూడిని కేంద్ర ఆరోగ్య శాఖ వైద్యుల బృందం గురువారం సందర్శించనుంది. గ్రామంలోని ఓ పౌల్ట్రీలో బర్డ్‌ఫ్లూ వైరస్‌తో కోళ్లు పెద్దసంఖ్యలో మృత్యువాత పడ్డాయి. పెరవలి మండలం కానూరు, తణుకు మండలం వేల్పూరుల్లోని పౌల్ట్రీల్లోను కోళ్లు వైరస్ బారినపడి చనిపోతుండగా వైరస్‌ను అదుపు చేసేందుకు లక్షల సంఖ్యలోనే కోళ్లను ఖననం చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం సందర్శించనున్న సెంట్రల్ టీం బర్డ్‌ఫ్లూ వ్యాప్తికి కారణాలపై పరిశీలన చేయనుంది. నీటి వనరులు ఏమైనా కలుషితమయ్యాయా? తదితర అంశాలను పరిశీలిస్తుంది. ఈ టీం జిల్లాకు రానున్న సమాచారాన్ని కాగుపాడు పీహెచ్‌సీతోపాటు, వీఆర్ గూడెం, మరికొన్ని పీహెచ్‌సీలకు అందించినట్టు తెలిసింది. సెంట్రల్ టీం జిల్లాలో పర్యటించడానికి ప్రోగ్రాంను డిజైన్ చేయాల్సిన డీఎంహెచ్‌వో కార్యాలయ ఐడీఎస్‌పీ విభాగం నుంచి వివరణ కోరేందుకు బుధవారం రాత్రి ఫోన్‌లో ప్రయత్నించగా ఎవరూ స్పందించలేదు.

గ్రూప్-2 మెయిన్ పరీక్షలకు సమన్వయ అధికారుల నియామకం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీపీఎస్సీ ఈ నెల 23న నిర్వహించనున్న గ్రూప్-2 మెయిన్ పరీక్షలకు పలువురు సమన్వయ అధికారులను నియమిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పరీక్షల పర్యవేక్షణకు జేసీని కో-ఆర్డినేటర్‌గా నియమించారు. ఏలూరులోని ఆరు కేంద్రాల్లో జరిగే మెయిన్ పరీక్షలకు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి జడ్పీ సీఈవో సుబ్బారావు, సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలకు డీఆర్డీఏ పీడీ విజయరాజు, సీఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు డ్వామా పీడీ కె.వి.సుబ్బారావు, సీఆర్ఆర్ మహిళా కళాశాలకు వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా, దుగ్గిరాల ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రానికి సెరీకల్చర్ డీడీ వాణి, ఏలూరు ప్రభుత్వాస్పత్రి సమీపంలోని సెయింట్ థెరిస్సా బాలికల జూనియర్ కళాశాల కేంద్రానికి హార్టీకల్చర్ అధికారి రామ్మోహన్ లైజన్ అధికారులుగా వ్యవహరిస్తారు. సంబంధిత పరీక్ష కేంద్రాల్లో సిట్టింగ్ ఏర్పాట్లు, తాగు నీరు, తదితర మౌలిక సదు పాయాలను ముందుగానే పరిశీలించాలని లైజన్ అధికారులను ఆదేశించారు.

పీఎం కిసాన్ నిధులు విడుదల

జిల్లాకు రూ.26.85 కోట్లు .. లక్షా 34 వేల మంది రైతులకు లబ్ధి

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరానికి సంబంధించి మూడో విడత పీఎం కిసాన్ నిధులు ఒక్కొక్క రైతుకు 2 వేల చొప్పున జిల్లాకు రూ.26.85 కోట్లు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ నిధులు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో లక్షా 34 వేల మంది రైతులకు పీఎం కిసాన్ లబ్ధి చేకూరనుంది. ఈ నిధులను రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తారు. పీఎం కిసాన్ పథకాన్ని 2019 ఫిబ్రవరిలో ప్రారంభించగా ఇప్పుడు విడుదల చేసిన నిధులు 19వ విడత నిధులుగా పేర్కొన్నారు. పీఎం కిసాన్ నిధులు రైతులకు పంటల సాగుకు ఎంతో ఉపకరిచనున్నాయి.

వివాహేతర సంబంధం హత్యకు దారితీసింది

- బావాయిపాలెం హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్ట్



7

తాడేపల్లిగూడెంలో దొంగనోట్ల కలకలం

నూజివీడు, తమిళనాడు ముఠా

మద్యం దుకాణాలు, పెట్రోల్ బంక్‌లే లక్ష్యం!

ఆయిల్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

ఐదుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం



సువర్ణశోభితం..



ప్రకృతి చిత్రమైనది.. తన సహజమైన అందాలతో ఎన్నో ఆనందాలను పంచుతుంది.. ఈ చిత్రం చూశారా.. ఆకాశానికి బంగారు తాపడం చేసినట్లు ఉంది కదూ.. బుధవారం సూర్యాస్తమయం వేళ జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయం వద్ద భానుడు పడమర కొండల్లోకి జారుతున్న సమయంలో ఆవిష్కృతమైన అద్భుత దృశ్యం..

చిత్రకారుడు వెంపటాపునకు రెండు అవార్డులు

తణుకు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్నేషనల్ ఆన్‌లైన్ గ్రూపు ఆర్ట్ ఎగ్జిబిషన్ పోటీలలో రెండు అవార్డులు లభించినట్లు తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ బరేలీకి చెందిన కళారత్నం ఫౌండేషన్ ఆఫ్ ఆర్ట్ సొసైటీ ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో కళా రత్నం అవార్డుతో పాటు ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డును సొసైటీ నుంచి అందుకున్నట్లు చెప్పారు. రచయిత, కళాకారుడు వాడ్రేవు సుందరరావు, కవి తాడినాడ భాస్కరరావు, చిత్ర కళా ఉపాధ్యాయుడు బొడ్డేటి శ్రీనివాసు తది తరులు వెంపటాపును అభినందించారు.



అవార్డు పొందిన చిత్రం



అంతర్జాతీయ తెలుగు భాషోత్సవాలకు రిషికి ఆహ్వానం

తణుకు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) తిరుపతి శ్రీనివాసా ఆడిటోరియంలో ఈనెల 27, 28 తేదీలలో జరుగునున్న మూడో అంతర్జాతీయ తెలుగు భాషా ఉత్సవాలకు తనకు ఆహ్వానం అందినట్లు తణుకుకు చెందిన కవి రిషి తెలిపారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనా సంస్థ, బెంగుళూరుకు చెందిన తెలుగు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సభల్లో ఆధునిక కవిత్వం- భాషా ప్రయోగాలు అనే అంశంపై పత్ర సమర్పణ చేసి ప్రసంగించాలని కోరినట్లు తెలిపారు.



ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలి

ఏలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో లాజిస్టిక్ సేవలను ప్రజలు ఉప యోగించుకోవాలని ఉమ్మడి జిల్లా ఏపీఎస్ ఆర్టీసీ కార్గో అసిస్టెంట్ ట్రాఫిక్ కమర్షియల్ మేనేజర్ సుబ్బారావు కోరారు.బుధవారం ఆయన జంగారెడ్డిగూడెం కార్గో లాజిస్టిక్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్గో లాజిస్టిక్ పార్శిల్ రవాణా సేవల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.187 కోట్ల ఆదాయం రాగా ఉమ్మడి జిల్లాకు రూ.91 లక్షలు సమకూరింద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 83 పట్టణాల్లో కార్గో పాయింట్ పది కిలో మీటర్ల పరిధిలో యాభై కేజీల లగేజీ వరకు పార్శిళ్లను డోర్ డెలివరీ చేయనున్నట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్‌లో మొదటి స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న 22 ఆర్టీసీ రీజి యన్లలో పశ్చిమ గోదావరి ప్రథమ స్థానంలో ఉందన్నారు. త్వరలో ఇంటి వద్ద పార్శిళ్లను పికప్ చేసుకునే విధంగా తణుకులో పైలట్ ప్రాజెక్టు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం డీఎం గంగాధర్, స్థానిక కార్గో డీఎంఈ సత్తిబాబు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం ఆర్టీసి డిపోలో మాట్లాడుతున్న ఏపిఎస్‌ఆర్టీసీ కార్గో అసిస్టెంట్ ట్రాఫిక్ కమర్షియల్ మేనేజర్ సుబ్బారావు



జాతీయ రికార్డులు అందిస్తున్న తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ చీఫ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు

ఒకేసారి ఆరు జాతీయ రికార్డులు సృష్టించిన జాగృతి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరానికి చెందిన నారాయణ జాగృతి మరో ఆరు జాతీయ రికార్డులు సాధించింది. భాషోత్సవాల్లో భాగంగా రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, ఏలూరు విజన్, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు శ్రీకృష్ణదేవ రాయ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠ శాలలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించిన ఆరు జాతీయ రికార్డులే లక్ష్యంగా నారాయణం జాగృతి అసమాన ప్రతిభ కనబరిచింది. తెలుగు సంవత్సరాలు (పుష్ప చక్రధారణ)లో భాగంగా 60 తెలుగు సంవ త్సరాలను 30 సెకన్ల కాల వ్యవధిలో చెప్పి 62వ రికార్డు, 75 తత్సమ పదాలకి తద్భవ రూపాలను రెండు నిమిషాల కాలవ్యవధిలో చెప్పి 63వ రికార్డు, సమాస పదానికి విగ్రహవాక్య నిర్మాణంలో భాగంగా 75 సమాస పదాలకు విగ్రహ వాక్యంతో సమాసం పేరును ఐదు నిమిషాల కాలవ్యవధిలో చెప్పి 64వ రికార్డును, 75హిందీ వాక్యాల్లోని దోషాలను నాలుగు నిమిషాల వ్యవధిలో సవరించి 65వ రికార్డు, 75 తెలుగుపదాలకు సొంత వ్యాక్యలను 8 నిమి షాల వ్యవధిలో వివరించి, 66వ రికార్డు, 75 ఇంగ్లీష్ వ్యాక్యాల్లోని దోషాలను 8 నిమిషాల వ్యవధిలో సవరించి, 67వ రికార్డుగా తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్, సూపర్ కిడ్స్ రికార్డుల్లో స్థానం సంపాదించింది. సిరిమువ్వ శ్రీనివాస్ పర్య వేక్షించి రికార్డులు సాధించినట్లు ధ్రువీకరరించారు.

ఏళ్ల తరబడి అద్దె గూళ్లల్లో !





సజ్జాపురంలో ఏళ్ల తరబడి అద్దె భవనంలో కొనసాగుతున్న ఈఎస్ఐ ఆసుపత్రి

రాష్ట్రపతి రోడ్డులోని అపార్టుమెంట్‌లో ఈఎస్ఐ ఉద్యోగుల కార్యాలయం

మునిసిపల్ కార్యాలయం ఎదురుగా కొండాలమ్మపుంత రోడ్డులో అపార్టుమెంట్‌లో రవాణాశాఖాధికారి కార్యాలయం



తణుకులో చాలా ప్రభుత్వ కార్యాలయాలకు సొంతగూడు కరువైంది..ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నిత్యం ప్రజలకు సేవలందించే రవాణా, సబ్ రిజిస్ట్రార్, కార్మిక శాఖ కార్యాలయం, ఈఎస్ఐ ఆసుపత్రి వంటి ప్రధాన కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. వేలాది రూపాయలు చెల్లించి అద్దె భవనాల్లో కార్యకలాపాల నిర్వహిస్తున్నారు. ఆయా కార్యాలయాలను బట్టి రూ.25 వేల నుంచి రూ.40 వేలు వరకు అద్దెలు చెల్లిస్తున్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ సజ్జాపురంలో ఏళ్ల తరబడి అద్దె భవనంలోనే ఉంటున్నది. అదికూడా మరమతులకు చేరింది. ఈఎస్ఐ ఉద్యోగుల కార్యాలయం కూడా రాష్ట్రపతి రోడ్డులోని అపార్టుమెంట్‌లోని మొదటి అంతస్తులో నిర్వహిస్తున్నారు. రవాణా శాఖా కార్యాలయం మొదట్లో కూరగాయలు మార్కెట్ వద్ద ఉండేది. తర్వాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా కొండాలమ్మ పుంత రోడ్డులోని అపార్ట్‌మెంట్ లోకి మార్చారు. దీనికోసం బైపాస్ రోడ్డులోని మున్సిపల్ స్థలంలో పెద్ద భవనం నిర్మించారు. ఇప్పటికి అక్కడకు మార్చలేదు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సజ్జాపురం ఆర్‌వోబీ వంతెన వద్ద అపార్టు మెంటులో ఉండేది. చాలా సంవత్సరాల తర్వాత ఇటీవల రైల్వే స్టేషన్ రోడ్డులోని అపార్టుమెంటులోకి మార్చారు. నిత్యం కార్మికులకు అందుబాటులో ఉంటే లేబర్ కార్యాలయం కూడా సొసైటీ రోడ్డులోని అపార్టుమెంటులో ఉంది. కమర్షియల్ టాక్సు కమిషనర్ కార్యాలయం. ఇది కూడా సంవత్సరాల తరబడి పాత పోస్టాఫీసు వీధిలోని భవనంలో స్టేట్‌బ్యాంకు పైన ఉంది. ఇలా చాలా వరకు ప్రభుత్వ కార్యాలయాలకు అద్దెభవనాల్లో కాలం గుడుపుతున్నాయి.

తణుకు (ఆంధ్రజ్యోతి)



రైల్వే స్టేషన్ రోడ్డులోని అపార్టుమెంటులో సజ్జాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

పాత పోస్టాఫీసు వీధిలోని భవనంలో కమర్షియల్ టాక్సు కమిషనర్ కార్యాలయం



ప్రకృతి వ్యవసాయం అభినందనీయం : జర్మనీ బృందం

ఏలూరుసిటీ/ కామవరపుకోట/ ద్వారకాతిరుమల ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం, రసాయిన వ్యవసాయం మధ్య గల వ్యత్యాసాలు నిజంగా ఆశ్చర్యకరంగా ఉన్నాయని, ప్రకృతి వ్యవసాయ విధానాల్లో ప్రయోజ నాలను స్పష్టంగా కనిపిస్తున్నాయని జర్మన్ ప్రతినిధి బృందం ప్రశంసించింది. జర్మన్ ప్రతినిధి బృందం రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న తమ 5 రోజుల పర్యటనలో భాగంగా 3వరోజు బుధవారం ఏలూరు జిల్లాలో వివిధ మండలాల్లో పర్యటించింది. ఏలూరు మండలం వెంకటాపురం గ్రామంలో టి.జ్యోతి పొలంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో అనుసరిస్తున్న ఏ-గ్రేడ్ వరిని పరిశీలించారు. బృంద సభ్యుడు లుకాస్ మాట్లాడుతూ సాధారణంగా జర్మనీ, ఐరోపాలో ఇలాంటి ప్రాజెక్టులు చిన్నవిగా ఉంటాయని, కేవలం ఇద్దరు లేదా ముగ్గురు రైతులు మాత్రమే ఇలాంటి విధానం అనుసరిస్తారని ఇక్కడ రైతులు అత్యధిక సంఖ్యలో అధిక విస్తీర్ణంలో చేయడం అభినందనీయమన్నారు.ద్వారకాతిరుమల మండలం గుండుగొలను కుంటలో ప్రకృతి వ్యవసాయ సేద్యాన్ని పరిశీలించారు. ప్రారంభంలో ఈ తరహా వ్యవసాయం కాస్త ఇబ్బంది అయినా భవి ష్యత్‌కు ఇదే మార్గమని ప్రశంసించారు. కామవరపుకోట మండలంలోని ఆడమిల్లి పరిసర గ్రామాల్లోని కొబ్బరి, అరటి, వరి పొలాలు, ఉద్యాన తోటలను పరిశీలిం చారు. ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయం మధ్య గల వ్యత్యాసాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ విధానాలు రైతులకు ప్రయోజనాలను ఇస్తున్నాయన్నారు.





విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న వెంకటసుబ్బారావు తదితరులు

పౌల్ట్రీ పరిశ్రమ సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్‌ఫ్లూ వల్ల పౌల్ట్రీ పరిశ్రమ తీవ్రనష్టాలను ఎదుర్కొంటుందని దీనిపై సీఎం చంద్రబాబును కలసి వినతిపత్రం అందజేసినట్టు పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, కాల్ధరి గ్రామానికి చెందిన పౌల్ట్రీ యజమాని కోమటపల్లి వెంకటసుబ్బారావు తెలిపారు. బర్డ్‌ఫ్లూ వల్ల పౌల్ట్రీ పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిందని వివరించగా ప్రభుత్వం నుంచి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని చంద్రబాబుకు హామీ ఇచ్చినటు చెప్పారు.

జల్ జీవన్‌కు బ్రేకులు

ప్రారంభించని పనులు రద్దు

ఏలూరు జిల్లాలో మొత్తం 1,771 పనులు

పూర్తనవి 796.. నిర్మాణ దశలో 304..

ప్రారంభం కానివి 671

ఇప్పటికీ మొదలుపెట్టనివి

వాటర్‌గ్రిడ్ పథకానికి అనుసంధానం

ఇంటింటికీ కుళాయి ప్రధాన లక్ష్యం



ఏలూరు సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా జల్‌జీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశ పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ జల్‌జీవన్ మిషన్ పనులు అంతంత మాత్రంగానే జరిగాయి. జిల్లాలో ఇంటింటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేసి తద్వారా అన్ని కుటుంబాలకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని రూపొందించారు. ఇందులో ప్రధానంగా మంచినీటి వనరులను ఉపయోగించుకుని వాటి ద్వారా ఇంటింటికీ తాగు నీరు అందించడానికి పైప్‌లైన్లు వేయాలని నిర్ణయించారు. జిల్లాలో జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.454.1 కోట్లతో 1771 పనులు చేయాలని నిర్ణయించగా ఇప్పటివరకు 796 పనులు మాత్రమే పూర్తి చేశారు. 304 పనులు నిర్మాణ దశలో ఉండగా 671 పనులను అసలు ప్రారంభించనే లేదు. ఇప్పటివరకు ఈ పథకంలో రూ.89.45 కోట్లు మాత్రమే ఖర్చుచేసి పనులు నిర్వహించారు.

గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం

ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలను ఏర్పాటు చేయడంతో పాటు వివిధ మంచినీటి పథకాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడంతో పథకంలో అభివృద్ధి చేయాల్సిన మంచినీటి వనరులు అభివృద్ధి చెందలేదు. దీంతో శాశ్వతంగా ఏర్పాటు చేయాల్సిన నిర్మాణాలను చేపట్టని పరిస్థితులు ఏర్పడ్డాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మంచినీటి పైప్‌లైన్లను ఏర్పాటు చేశారు. కాని మంచినీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాలంటే అక్కడ ప్రధానంగా మంచినీటి వనరులు ఉండాల్సిందే. ప్రతి వ్యక్తికి 55 ఎల్‌పీసీడీ వాటర్ (రోజుకు 55 లీటర్ల నీరు) ఇవ్వాల్సి ఉంది. ఈ ప్రకారం వివిధ మంచినీటి వనరులను అభివృద్ధి చేసి వాటిద్వారా మంచినీటి కుళాయిలకు నీరు సరఫరా చేస్తారు.

ఇదే విషయాన్ని జడ్పీ సర్వసభ్య సమావేశాల్లోను, స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు ప్రధానంగా చర్చించారు. అసలు పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు ఆ పనులను రద్దు చేసి వేరే కాంట్రాక్టర్లకు అప్పగించాలని, మధ్యలోనే నిలిచిపోయిన పనులకు మళ్లీ టెండర్లు పిలిచి కాంట్రాక్టు అప్పగించాలని పేర్కొన్నారు. కేవలం పైప్‌లైన్లు మాత్రమే ఏర్పాటు చేపి ప్రధాన వనరులకు సంబంధించి నిర్మాణాలు చేపట్టక పోవటం వల్ల ఆ పైప్‌లైన్లు నిరుపయోగంగా ఉన్నాయని, వెంటనే ఆ నిర్మాణాలను త్వరితగతిన చేపట్టడానికి తిరిగి టెండర్లు పిలిచి సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు.

671 పనులు రద్దు

జల్‌జీవన్ మిషన్ పథకంలో జిల్లాలో చేపట్టని (ఇంకా ప్రారంభించని) 671 పనులను రద్దు చేస్తూ జీవో నెంబరు 73ను గతేడాది డిసెంబరు 21న విడుదల చేసింది. అలాగే ప్రారంభించి పూర్తికాని పను లను ఈ ఏడాది జూన్‌లోగా పూర్తి చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో రద్దు చేసిన 671 పనులను వాటర్‌గ్రిడ్ పథకంలో చేపట్టాలని నిర్ణయించారు. ప్రధానంగా మంచినీటి పైప్‌లైన్లతో పాటు రక్షిత మంచినీటి పథకాలు, సీపీడబ్ల్యూ పథకాలతో పాటు ఇతర మంచినీటి పథకాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ వాటర్‌గ్రిడ్ పథకాన్ని ప్రారంభించినా గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం నిర్వహణ జరగలేదు. వాటర్ గ్రిడ్ పథకం ద్వారా గ్రామాలకు మంచినీటి సరఫరా చేసి తద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిలు అందించడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇప్పుడు జల్‌జీవన్ మిషన్‌లో రద్దు చేసిన పనులను వాటర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేయడంతో ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. రద్దు చేసిన పనులకు సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. అదే విధంగా గత ప్రభుత్వంలో కేటాయించిన పనులతో పాటు కొత్తగా సమస్యలు ఉన్న ప్రాంతాల్లో పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపించారు.

జిల్లాలో 3.69 లక్షల కుటుంబాలు

జిల్లాలో 3లక్షల 69 వేల కుటుంబాలుండగా ఇందులో ఇప్పటికే గతేడాది ఏప్రిల్ 1 నాటికి 3,09,839 మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చినట్టు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నివేదికలు చెబుతున్నాయి. మిగిలిన 59 వేల 298 కుటుంబాలకు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

విద్యార్థులకు వరం వాటర్ స్పోర్ట్స్

ఎర్రకాల్వ జలాశయంలో శిక్షణ

ఏలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం కొంగువారి గూడెం లోని కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలో వాటర్ స్పోర్ట్స్ శిక్షణా కేంద్రం పేద విద్యార్థులకు వరంగా మారుతున్నది. ఇక్కడ తర్ఫీదు పొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అనేక చాంపియన్ షిప్‌లు చేజిక్కించుకున్నారు. అనేక జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారు. 2018 మేలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఆంధ్ర ప్రదేశ్ క్రీడా ప్రాధికారిక సంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఎర్రకాలువ జలాశయంలో వాటర్ స్పోర్ట్స్ (జలక్రీడలు) కేంద్రం ఏర్పాటు చేశారు.ఈ కేంద్రానికి పోలీసు శాఖలో పనిచేసే వాటర్ స్పోర్ట్స్‌లో అనుభవం ఉన్న కోచ్‌లు పి.కృష్ణమూర్తి, ఎం.రాజేష్‌లను డిప్యూటేషన్‌పై శాప్ నియ మిం చింది. వారిద్దరూ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించే దిశగా శిక్షణ ఇస్తు న్నారు. శిక్షణా కేంద్రానికి దగ్గరగా ఉన్న మత్స్యకారుల పిల్లలు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన బాల, బాలికలు, యువకులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ఎంతో మంది పేదలకు ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. పది సంవత్సరాల నుంచి ఇరవై సంవత్సరాల వయసు వారు ఈ వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ పొందడానికి అర్హులు. ఇక్కడ శిక్షణ పొందాలంటే కచ్చితంగా ఈత వచ్చి ఉండాలి. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం కూడా శిక్షణ ఇస్తున్నారు. నీటిలో శిక్షణ ఇచ్చేముందు వ్యాయామం చేయిస్తారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా విద్యార్థులకు లైఫ్ జాకెట్‌లు కూడా అందుబాటులో ఉంచారు. ఇప్పటివరకు వంద మందికి పైగా ఇక్కడ శిక్షణ పొందారు. ప్రస్తుతం ముప్పై మంది శిక్షణ పొందుతుండగా వారిలో ఐదుగురు బాలికలున్నారు. 2023లో జరిగిన రాష్ట్రస్థాయి వాటర్ స్పోర్ట్స్‌లో ఓవరాల్ ఛాంపియన్ షిప్, 2024 నంద్యాలలో జరిగిన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ పొందినట్లు కోచ్‌లు కృష్ణమూర్తి, రాజేష్ తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో తమ విద్యార్థులు విజయం సాధించడమే తమ లక్ష్యమని కోచ్‌లు తెలిపారు. కాగా ప్రస్తుతం ఇక్కడ ఎనిమిది బోట్లు మాత్రమే ఉన్నాయని మరిన్ని ఉంటే మరింత మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.



కోచ్‌లు కృష్ణమూర్తి, రాజేష్





శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మూడు విభాగాలలో శిక్షణ

ఈ కేంద్రంలో విద్యార్థులకు మూడు విభాగాలలో శిక్షణ ఇస్తున్నారు.

- మొదటిది కయాకింగ్ : రెండు బ్లేడులతో ఉన్న పెడల్ బోటు నడపడం
- రెండవది కెనోయింగ్ : మోకాళ్ళతో పెడలింగ్ చేస్తూ నడపడం
- మూడవది రోవింగ్ : ఎక్కువ మంది ఒకే బోటులో ఉండి నడపడం

అసంపూర్తిగా అకాడమీ భవనం



ఎర్రకాలువ జలాశయంలో వాటర్ స్పోర్ట్స్ శిక్షణా కేంద్రం మంజూరైన వెంటనే 2018-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.మూడు కోట్లతో వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు నిదులు మంజూరు చేసింది. పనులు కూడా వేగంగా ప్రారంభించారు. కానీ 2019 ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటర్ స్పోర్ట్స్ అకాడమీ పనులను నిలిపివేశారు. శిక్షణా కేంద్రం వద్ద అకాడమీ ఉండడం వల్ల ఎంతో మంది గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేద విద్యార్థులకు ఇక్కడే పౌష్టికాహారం, వసతి సౌకర్యం కల్పిస్తారు. దీంతో వారు అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి వీలవుతుంది. అంతే కాకుండా ఈ అకాడమీకి ప్రత్యేక నిధులు కేటాయిస్తారు. కాబట్టి మౌలిక వసతులన్నీ సమకూరుతాయి. ప్రభుత్వం వాటర్ స్పోర్ట్స్ అకాడమీ భవన పనులను ప్రారంభించాలని క్రీడాభిమానులు, ప్రజలు కోరుతున్నారు.

లంచం ఇస్తేనే సాగుపై అధికారులు చర్యలు ?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిడమర్రు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : లంచం ఇస్తేనే సాగు అనే అంశంపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే.. విచారణ అనంతరం అధికారులు వివరాలు బహిరంగంగా చెప్పకపోయినప్పటికీ ఒకరిపై చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. లంచం అభియోగం నిరూపణ కావడంతో ఏలూరు జిల్లా అధికారులు ఒకరిని టెర్మినేషన్ చేసినట్టు సమాచారం. ఏలూరు జిల్లా కార్యాలయంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న నబిగిరి శ్రీనివాస బాబును విధుల నుంచి తొలగించారని సమాచారం. మంగళవారం నిడమర్రు పంచాయతీ కార్యాలయంలో శ్రీనివాస బాబుపై ఆరోపణలు రావడంతో ఏలూరు రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి విచారణ చేపట్టారు. తదనంతరం నివేదికను జిల్లా ఫారెస్ట్ అధికారి బి.విజయకు సమర్పించారు. నివేదికలో వివరాలను అధికారులు బహిర్గతం చేయనప్పటికీ శ్రీనివాసబాబును టెర్మినేషన్ చేసినట్టు తెలిసింది. ఈ విషయమై ఏలూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మిని సంప్రదించే ప్రయత్నం చేసినా అందుబాటులోకి రాలేదు.

ఎమ్మెల్సీ పోరు

అవసరం మేరకు సెలవులు

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27న పోలింగ్ రోజున ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు అవసరం మేరకు సెలవులు ప్రకటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసిన కార్యాలయాలు, సంస్థలకు ఈ నెల 26న, పోలింగ్ జరిగే 27న స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. పెదపాడు మండలం వట్లూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేసినందున మార్చి 3న కళాశాలకు స్థానిక సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

21లోగా ఓటర్ల స్లిప్పులు పంపిణీ చేయండి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల స్లిప్పుల పంపిణీ ఈ నెల 21లోగా పూర్తి చేయాలని ఆర్వో కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 16వేల స్లిప్పుల పంపిణీ చేశారని, మిగిలిన వాటిని ఈ నెల 21లోగా పూర్తి చేయాలన్నారు. అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటర్ల స్లిప్పుల పంపిణీ జరగాలన్నారు.

1 నుంచి మైక్‌లు కట్ : డీఎస్పీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో సౌండ్ బాక్స్‌లు, మైక్‌సెట్లను వినియోగించాలంటే ముందస్తుగా పోలీసు అనుమతి తీసుకోవాలని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ఎవరైనా సౌండ్ సిస్టమ్‌ను సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. మరోవైపు మార్చి 1 నుంచి పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగనున్న దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బహిరంగ ప్రదేశాల్లో మైక్‌లకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. మార్చి 1 నుంచి విద్యార్థుల పరీక్షలు అయ్యే వరకూ ఎట్టి పరిస్థితుల్లో మైక్ పర్మిషన్ ఇవ్వడం జరగదన్నారు. చర్చిలు, మసీదులు, దేవాలయాలపై మైక్‌లు కూడా సౌండ్ తగ్గించి పూజలు, ప్రార్థనలు నిర్వహించుకోవాలన్నారు. ఎవరికైనా ఇబ్బంది కలిగితే వెంటనే 112కు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు విఘాతం కల్గిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

భీమవరం బైపాస్‌కు మోక్షం

- డీపీఆర్‌కు కేంద్రం అనుమతి
- 40 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం
- ప్రతిపాదనలు సిద్ధం
- 590 ఎకరాలు అవసరం
- డ్రోన్ కెమెరాలతో సర్వే
- కేంద్రమంత్రి వర్మ వెల్లడి

భీమవరంటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భీమవరం వాసులు 25 ఏళ్లుగా ఎదురుచూస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణం కల నెరవేరనుంది. పామర్రు నుంచి దిగమర్రు వరకు 165 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రెండో ప్యాకేజీ ఆకివీడు బైపాస్ నుంచి దిగమర్రుకు 40 కిలోమీటర్ల కొత్త మార్గంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం అయ్యాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు. భీమవరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబుతో కలిసి వర్మ మాట్లాడారు. సుమారు 25 ఏళ్ల నుంచి భీమవరం బైపాస్ రోడ్డు సమస్య కోర్టు కేసులు, పలు వివాదాలతో నత్త నడకన సాగుతోందన్నారు. ఆరు నెలలుగా బైపాస్ రోడ్డు సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే అంజిబాబుతో కలసి అధికారులతో పలుమార్లు సమావేశమయ్యామని ఎట్టకేలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి, అధికారులతో తాను ఎన్నోసార్లు సమావేశం అయ్యానని, నేషనల్ హైవే డైరెక్టర్ జనరల్ కూడా ఢిల్లీ నుంచి వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించారని వర్మ వివరించారు. మొత్తం నాలుగు కొత్త మార్గాలలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రాగా నిర్మాణ వ్యయం, దూరం, రైల్వే క్రాసింగ్‌లు లేకపోవడం పరిగణనలోకి తీసుకొని ఎన్‌హెచ్-165 రెండో ప్యాకేజీలో భాగంగా ఆకివీడు నుంచి దిగమర్రు వరకు, ఆకివీడు నుండి వీరవాసరం వరకు కొత్త బైపాస్ రోడ్డుకు డీపీఆర్ సిద్ధం చేయడానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు.

కొత్త బైపాస్ రోడ్ ఇలా..

ఆకివీడు బైపాస్ నుంచి అజ్జమూరు, చెరుకువాడ, చిన్న పుల్లేరు, పెద్ద పుల్లేరు, సీసలి, కోలనపల్లి, కోపల్లె, పెదమిరం, చినమిరం, రాయలం భీమవరం గుడిపూడి, తాడేరు, గొరగనమూడి, పెన్నాడ అగ్రహారం, శృంగవృక్షం, వీరవాసరం బ్రిడ్జి వరకు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని మంత్రి శ్రీనివాస వర్మ తెలిపారు. డ్రోన్ కెమెరాలతో సర్వే ఆధారంగా కొత్త బైపాస్ రోడ్డు నిర్మాణానికి సుమారు 590 ఎకరాలు అవసరమవుతుందని అధికారులు అంచనా వేశారన్నారు. బైపాస్ రోడ్డు సమస్య పరిష్కారానికి విశేష కృషి చేసిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, భీమవరం ఎమ్మెల్యే అంజిబాబును భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, బీజేపీ నాయకులు పలువురు అభినందనలు తెలిపారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో వీఆర్ఎస్ అమలు

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం మంజూరు చేసిన ప్రత్యేక ప్యాకేజీ 11,440 కోట్లు అమలు చేసేందుకు విధి విధానాలు వేగవంతం చేశామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ఆలోచన కేంద్రానికి లేదని, అలాంటి ఆలోచన ఉంటే కేంద్రం ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.11,440 కోట్లు ఎందుకు మంజూరు చేస్తుందని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో సమస్యలు పరిష్కరించి 7.3 మిలియన్ల స్టీల్ ఉత్పత్తి లక్ష్యం చేరుకుంటామన్నారు. ప్రస్తుతం విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగులకు వీఆర్ఎస్‌కు అమలు చేస్తున్నామని ఇప్పటి వరకు 1,613 మంది వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా 1,141 మంది అర్హులుగా అధికారులు గుర్తించారని మిగిలిన వారి విషయంలో ఒక కమిటీ వేశామన్నారు. అర్హులను గుర్తించి వీఆర్ఎస్‌ను మంజూరు చేస్తామన్నారు. మార్చి చివరి నాటికి వీఆర్ఎస్‌కు స్కీం అమలు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. తొలి విడతగా దరఖాస్తు చేసుకున్న 150 మందికి వీఆర్ఎస్ ఇస్తూ ఉత్తర్వులు ఇవ్వబోతున్నామన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, టీడీపీ నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు పేరిచర్ల సుబాష్, కలిదిండి వినోద్ కుమార్ సుభాష్‌రాజు, తదితరులు పాల్గొన్నారు

పోరాట యోధుడు ఛత్రపతి శివాజి


ఏపీ నిట్‌లో నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భారతదేశ చరిత్రలో గొప్పపోరాట యోధుడు ఛత్రపతి శివాజి అని విశాఖకు చెందిన సామాజిక కార్యకర్త జనార్దన్ అన్నారు. ఏపీ నిట్ ప్రాంగణంలో ఛత్రపతి శివాజి మహారాజ్ జయంతి బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనార్దన్ మాట్లాడుతూ ఛత్రపతి స్వతంత్ర భారతం కోసం కృషి చేశాడన్నారు. 17 ఏళ్ల వయస్సులోనే యుద్ధ భూమిలో కాలు మోపి శత్రువులను చీల్చి చెండాడిన ఘనత ఛత్రపతికే దక్కుతుందన్నారు. యువత శివాజిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్‌శాస్త్రి, మెకానికల్, బయోటెక్నాలజీ, ఎస్‌వోఎస్ విభాగాధిపతులు డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ సుదర్శన దీప, డాక్టర్ అమరేంద్రరెడ్డి, ఆచార్యులు రాజేశ్వరరెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల పాఠశాల టీచర్ తీరుపై విచారణ


విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న డీసీపీవో సూర్యచక్రవేణి, డీఈవో వెంకట లక్ష్మమ్మ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో లెక్కల టీచర్ ఎంఎన్‌వి ముత్యాలరావు విద్యార్థులను కొట్టి కులం పేరుతో దూషించారన్న అభియోగంపై అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. డీసీపీవో సూర్యచక్రవేణి, డీఈవో వెంకట లక్ష్మమ్మ పాఠశాల విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థుల తల్లిదండ్రులను విచారించి రాతపూర్వక వాంగ్మూలం నమోదు చేశారు. గత ఏడాది నవంబర్ 25న ద్వారకాతిరుమ లకు చెందిన గుండే ధర్మరాజు కుమారుడు త్రివిక్రమ్, గుండే మాణిక్యం కుమార్తె సహస్రను టీచర్ దారుణంగా కొట్టడమేకాకుండా కులం పేరుతో దూషించినట్లు బేతాళ సుదర్శనం ఎస్సీ జాతీయ కమిషన్‌కు డిసెంబర్ 6న ఫిర్యాదు చేశారు. టీచర్‌ను అరెస్టు చేయాలని ఎస్సీ జాతీయ కమిషన్ డైరెక్టర్ గెడ్డ సునీల్‌కుమార్ బాబును కోరారు. ఆ టీచర్‌ను కామవరపుకోట మండలం జలపవారిగూడెం పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. పాఠశాలలో అధికారుల విచారణ అనంతరం నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. విచారణ అనంతరం పాఠశాలను డీసీపీవో సూర్యచక్రవేణి, డీఈవో వెంకట లక్ష్మమ్మ పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

డిక్కీలో సొమ్ము ఉంచారా..

క్షణాల్లో గల్లంతు

- రిజిస్ట్రార్ కార్యాలయాలు, బ్యాంకుల వద్ద రెక్కీ
- పోలీసుల నిఘా.. అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్
- రూ.3.5 లక్షల నగదు స్వాధీనం


పోలీసుల అదుపులో నిందితుడు, వివరాలు చెబుతున్న డీఎస్పీ జయసూర్య

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, బ్యాంకుల వద్ద కాపు కాస్తాడు.. ఎవరైనా వాహన డిక్కీలో డబ్బులు పెట్టి వెళ్లడాన్ని గమనిస్తే వారిని వెంబడిస్తాడు. డిక్కీలో నగదు ఉంచిన వాహనం ఎక్కడ పార్క్ చేసినా రెండో కంటికి తెలియకుండా కొట్టేస్తాడు.!

భీమవరం క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వాహన డిక్కీలో ఉంచిన డబ్బు కొట్టేస్తున్న అంతర్ రాష్ట్ర దొంగను భీమవరం టూటౌన్ పోలీసులు చాకచక్యంగా బుధవారం అరెస్ట్ చేశారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఆర్‌జీ.జయసూర్య వివరాలు తెలిపారు. నెల్లూరు జిల్లా బోగోలు మండలం కత్తరాలతిప్ప కాలనీకి చెందిన పీటల మహేష్ జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. 2023 ఆగస్టులో భీమవరం మండలం చిన అమిరం గ్రామానికి చెందిన అడ్డాల శ్రీనివాసరావు సొమ్ము కాజేశాడు. శ్రీనివాసరావు స్నేహితునితో కలిసి భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆస్తి లావాదేవీ అనంతరం కొంత డబ్బును ద్విచక్ర వాహనం డిక్కీలో పెట్టుకుని బయలుదేరాడు. అక్కడ కాపుకాసిన పీటల మహేష్, అతని స్నేహితుడు బెంజిమెన్ శ్రీనివాసరావు వాహనాన్ని వెంబడించారు. రాయలం రోడ్డులో కోళ్ల సీతారాం ఇంటి వద్ద శ్రీనివాసరావు వాహనాన్ని పార్క్ చేసి లోపలికి వెళ్లాడు. దీనితో మహేష్, బెంజిమెన్ వాహన డిక్కీని బలవంతంగా తెరిచి సుమారు రూ. 10 లక్షల సొమ్మును దొంగిలించారు. పీటల మహేష్ తన వాటాగా వచ్చిన రూ. 5 లక్షలలో రూ. 1.50 లక్షలను జల్సాలకు ఖర్చు పెట్టి మిగిలిన రూ. 3.50 లక్షల నగదు కారు కొనడానికి దాచాడు. ఈ నేపథ్యంలో బుధవారం వైజాగ్ బయలుదేరి భీమవరంలో దిగాడు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మరొక దొంగతనం చేసి ఖరీదైన కారు కొనుగోలు చేయడానికి వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. సీఐ కాళీచరణ్ చాకచక్యంగా మహేష్‌ను అరెస్ట్ చేసి రూ. 3.50 లక్షల నగదును రికవరీ చేశారు.

జీవితమంతా నేరచరితే..

నెల్లూరు జిల్లా బోగోలు మండలం కత్తరాలతిప్పకు చెందిన పీటల మహేష్ సుమారు 15 ఏళ్ల నేరచరిత్ర ఉంది. చెడు వ్యసనాల కోసం డబ్బులు సరిపోక దొంగతనాలు చేయడం మొదలెట్టాడు. తరచూ బ్యాంకుల వద్ద, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద నగదు లావాదేవీలు జరిపే వారిని గమనించి డబ్బులు కొట్టేస్తాడు. నెల్లూరు జిల్లాలో 5, అన్నమయ్య జిల్లాలో 5, తిరుపతిలో 1 కేసు ఉన్నాయి. నెల్లూరు జిల్లా బిట్రగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక సస్పెక్ట్ షీటు, ఒక రౌడీషీట్ కూడా ఉంది. ఇటీవల రాజంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 3 దొంగతనాల కేసులో అరెస్ట్ కావడంతో జైలుకెళ్లినా బెయిల్‌పై బయటకు వచ్చాడు. భీమవరంలో మహేష్‌తోపాటు దొంగతనానికి పాల్పడిన బెంజిమెన్ పోలీసులకు పట్టుబడలేదు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన టూటౌన్ సీఐ కాళీచరణ్, ఎస్ఐ ఇజ్రాయేల్, సిబ్బంది శరత్, గోపి, నరేంద్రను డీఎస్పీ జయసూర్య అభినందించి నగదు రివార్డు ఇచ్చారు.


మొబైల్ దుకాణంలో క్లూస్ టీమ్‌తో కలిసి పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

మొబైల్ దుకాణంలో చోరీ

కాళ్ళ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) స్థానికంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుగా మొబైల్ షాపులో మంగళవారం అర్ధరాత్రి దుండగులు దొంగతనం చేశారు. సుమారు రూ. 50 వేలు విలువైన ఫోన్లు, మొబైల్ సామగ్రి చోరీకి గురైనట్లు దుకాణ యజమాని ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. కాళ్ల ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ క్లూస్ టీమ్ షాపులోని వస్తువులు పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచితులు అనుమానాస్పదంగా తిరగడం గుర్తిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

వివాహేతర సంబంధం

హత్యకు దారితీసింది

- బావాయిపాలెం హత్య కేసు ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్ట్


హత్య కేసు వివరాలు చెబుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ, ఎస్ఐలు

నిడమర్రు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బావాయిపాలెంలో యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సబంధం నేపథ్యంలో హత్య జరిగిందని నిర్ధారణకు వచ్చిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. సీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ వివరాలు తెలిపారు. బావాయిపాలెం గ్రామానికి చెందిన పిల్లి ఏసుబాబు, పిల్లి అన్నవరం, ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన గెద్దాడ శ్రీనివాసరావును అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

పథకం ప్రకారం హత్య

బావాయిపాలెం గ్రామానికి చెందిన పిల్లి ఏసు భార్యతో మజ్జి ఏసు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో గతంలో ఏసు, అతడి తండ్రి అన్నవరం కుల పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ మజ్జి ఏసు ప్రవర్తన మారకపోవడంతో అతడిని అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. పిల్లి ఏసు, అన్నవరం కలిసి ఉండి మండలం కోలమూరు శ్రీనివాసరావుతో కలిసి పది రోజుల ముందే పథకం వేశారు. పిల్లి ఏసు భార్య సెల్‌ఫోన్ నుంచి మజ్జి ఏసుకు మెసేజ్‌లు పంపించారు. ఈ నెల 15న సాయంత్రం మహాదేవపట్నంలో ఆమె ఇంటికి రమ్మని మెసేజ్ చేశారు. దీనితో మజ్జి ఏసు మహదేవపట్నం వెళ్లగా అతడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. చుట్టుపక్కల బంధువులు అతడిని పోలీసులకు అప్పగించాలని సూచించారు. మా ఊరి పెద్దల్లో పంచాయితీ పెడతామంటూ అదేరోజు రాత్రి బావాయిపాలెం తీసుకొచ్చారు. బావాయిపాలెం గ్రామ శివారులో చినకాపవరం కాలువ వద్ద కొబ్బరి కాయలు కోసే కత్తితో ఏసు చెయ్యిని పిల్లి అన్నవరం తెగనరికాడు. మిగతా ఇద్దరు అతడికి సహకరించారు. తెగనరికిన చెయ్యిని దూరంగా విసిరేసి పారిపోయారు. తీవ్ర రక్త స్రావంతో మజ్జి ఏసు మృతి చెందాడు.

ఈ కేసులో నిందితులు ఉపయోగించిన కత్తి, మోటారుసైకిళ్లు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పిల్లి ఏసు, పిల్లి అన్నవరం, గెద్దాడ శ్రీనివాసరావును కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో నిడమర్రు సీఐ ఎంవీ.సుభాష్, ఎస్ఐ ఎం.వీరప్రసాద్, గణపవరం, చేబ్రోలు ఎస్ఐలు ఎ.మణికుమార్, సూర్య భగవాన్ మూడు బృందాలుగా కేసు విచారణ చేపట్టారు. త్వరితగతిన కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ కేపీఎస్.కిశోర్ అభినందించారు.

బాలికను నమ్మించి మోసగించాడు

పోక్సో కేసు నిందితుడికి 20 ఏళ్ల జైలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తర్వాత మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆపై ఆమెను గర్భవతిని చేసి గల్ఫ్ పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ ఏలూరులో ఉన్న పోక్సో కోర్టు న్యాయాధికారి ఉమాసునంద బుధవారం తీర్పు చెప్పారు.

ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన దొంగ చిన బ్రహ్మయ్య (24) 2014 మే 5న అదే మండలంలో బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో దొంగ చిన బ్రహ్మయ్య ఆమె ఇంటికి వెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఎవరికి చెప్పవద్దని పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. అప్పటి నుంచి అనేక మార్లు లైంగిక దాడి కొనసాగించాడు. ఆమె గర్భం దాల్చడంతో ఆసుపత్రికి తీసుకు వెళ్లగా వైద్యులు ప్రసవం చేశారు. పుట్టిన బిడ్డను విజయవాడ తీసుకువెళ్లగా మరణించింది. ఆ తర్వాత బాలికను పెళ్లి చేసుకుంటానని చెబుతూ కాలయాపన చేసిన దొంగ చినబ్రహ్మయ్య దుబాయి వెళ్లిపోయాడు. దీంతో బాధితురాలు 2015 అక్టోబర్ 29న గణపవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ బి.హరికృష్ణ కేసు నమోదు చేశారు. అప్పటి ఏలూరు డీఎస్పీ కేజీవీ.సరిత, తరువాత డీఎస్పీ గోగుల వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేశారు. అనంతరం డీఎస్పీ కె.ఈశ్వరరావు ఈ కేసులో నిందితుడు చిన బ్రహ్మయ్యను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు వేశారు. ఈ కేసు ఏలూరులోని పోక్సో జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. దొంగ చిన బ్రహ్మయ్యపై నేరం రుజువు కావడంతో 20 సంవత్సరాల జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి ఉమా సునంద తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. బాధితురాలికి ఐదు లక్షల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ వాసర్ల అమర శ్రీనివాస్ వాదించగా, ప్రాసిక్యూషన్‌కు గణపవరం సీఐ ఎం సుభాష్, గణపవరం ఎస్ఐ మణికుమార్, కోర్టు కానిస్టేబుల్ వై రాజేష్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, మహిళా హెడ్ కానిస్టేబుల్ ఎంవి రమణలు సహకరించారు.

తలపై హెల్మెట్ ఉంటే ప్రాణం నిలిచేది!

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


సంఘటనాస్థలంలో బాలాజీ మృతదేహం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ పెట్టుకోవడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని పోలీసులు, అధికారులు పదేపదే చెబుతున్నారు. పోలీసులు కేసు రాస్తారని కొందరు హెల్మెట్ బండికి తగిలిస్తున్నారు కానీ తలకు ధరించడం లేదు. ద్విచక్రవాహనం వాహనంపై ఒక వ్యక్తి హెల్మెట్‌ను మోటారు సైకిల్ ట్యాంకుపై ఉంచాడు. అంతలోనే ప్రమాదానికి గురయ్యాడు. హెల్మెట్‌కు చిన్న గీత లేకుండా పక్కనే పొదల్లో పడింది. అతడి తల రోడ్డుకు బలంగా తాకి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. హెల్మెట్ ధరించి ఉంటే బతికేవాడని స్థానికులు చెబుతున్నారు.

పెదపాడు మండలం జైపురం గ్రామానికి చెందిన భలే బాలాజీకి భార్యతో మనస్పర్ధలతో ఒంటరిగా ఉంటున్నాడు. ఏలూరు రూరల్ మండలం కోటేశ్వర దుర్గాపురం పరిధిలోని ఉన్న చేపల చెరువుల వద్ద పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం బాలాజీ మోటారు సైకిల్‌పై కోటేశ్వర దుర్గాపురం వెళుతూ గ్రామ సమీపంలోని రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పొగమంచు వల్ల ముందు వెళుతున్న వాహనాన్ని ఢీ కొన్నాడా లేదా పశువులను ఢీకొని పడిపోయాడా అనేది తెలియాల్సి ఉంది. అతను మోటారు సైకిల్ పైనుంచి పడడంతో తల రోడ్డుకు బలంగా తాకడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ట్యాంక్‌పై ఉన్న హెల్మెట్ మాత్రం పక్కన ఉన్న పొదల్లో పడిఉంది. అతడు హెల్మెట్ ధరించి ఉంటే బతికి ఉండేవాడని స్థానికులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో భవనం పైనుంచి దూకి..

తాడేపల్లిగూడెం రూరల్ ఫిబ్రవరి 19,(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భవనం పై నుంచి దూకిన యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తాడేపల్లిగూడెం రూరల్ పోలిసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద తాడేపల్లికి చెందిన పోలిశెట్టి అజయ్‌కుమార్ (27) జేసీబి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఇటీవల కుటుంబంలో కలహాల నేపథ్యంలో సోమవారం మద్యం మత్తులో ఒక భవనం పై నుంచి దూకేశాడు. తీవ్ర గాయాలైన అతడిని సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రసాద్ వివరించారు.

ఆర్థిక సమస్యలతో కలుపు మందు తాగేశాడు

ఏలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మద్యంలో కలుపు మందు కలిపి తాగిన వ్యక్తి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఒంపోలు సూరిబాబు (37) కార్పెంటర్ పని చేస్తాడు. 16 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న సూరి బాబుకు ఇద్దరు పిల్లలున్నారు. స్థానిక ఇందిరానగర్ కాలనీలో షాపు పెట్టాడు. పనులు లేక షాపు మూసేసి ఇతర పనులకు వెళుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సూరిబాబు ఈ నెల 11న రాత్రి మద్యంలో కలుపు మందు కలిపి తాగేశాడు. పట్టణంలోను ఉన్న అతడి సోదరి ఇంటికి వెళ్లి వాంతులు చేసుకున్నాడు. స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ ఐదు రోజుల చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని సోదరుడు నాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

తాడేపల్లిగూడెంలో

దొంగనోట్ల కలకలం

నూజివీడు, తమిళనాడు ముఠా

మద్యం దుకాణాలు, పెట్రోల్ బంక్‌లే లక్ష్యం!

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో దొంగనోట్ల చలామణిపై కలకలం రేగింది. పట్టణంలో వారం రోజులుగా ఒక ముఠా సంచరిస్తూ మద్యం దుకాణాలు, పెట్రోల్ బంకులు లక్ష్యంగా దొంగనోట్లు మార్చుతున్నట్లు సమాచారం. ఇటీవల కౌంటర్లలో తరచు దొంగనోట్లు వస్తున్నట్టు గుర్తించిన మద్యం వ్యాపారులు పోలీసులకు సమాచారం అందించడంతో నిఘా ఉంచారు. ముఠా సభ్యులను పట్టుకుని వారి నుంచి సుమారు రూ.2.5 లక్షల విలువైన రూ.500 నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. దొంగనోట్ల ముఠా కీలక సభ్యులు తమిళనాడు, నూజివీడు ప్రాంతాలకు చెందిన వారిగా భావిస్తున్నట్టు సమాచారం. ఈ ముఠాలోని 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలుస్తోంది.

దొంగనోట్లను మార్చేందుకు రద్దీగా ఉండే మద్యం షాపులు, పెట్రోల్ బంకులను ఎంచుకున్నారు. జిల్లాలో రూ.10 లక్షల విలువగల నోట్ల మార్పిడికి పాల్పడినట్టు సమాచారం. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు నిఘా పెట్టారు.

అసలు నోట్లకు తీసిపోనివిధంగా..

జిల్లాలో మారకంలోకి వస్తున్న నకిలీ నోట్లు అసలు నోట్లకు ఏమాత్రం తీసిపోని విధంగా నోట్లు తళుక్కుమంటున్నాయి. ప్రింటింగ్, నాణ్యతలో తేడా లేకుండా అధునాతన టెక్నాలజీని ముఠా వాడుతున్నట్లు గుర్తించినట్లు సమాచారం.


ఫ్యాక్టరీలో ప్రమాదం అనంతరం పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్, సీఐ, ఎస్ఐ

ఆయిల్ ఫ్యాక్టరీలో

అగ్నిప్రమాదం

ఐదుగురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం

దెందులూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం పంచాయతీ పరిధిలోని నాగహనుమాన్ ఆయిల్ ఫ్యాక్టరీలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆయిల్ ఫ్యాక్టరీలోని బాయిలర్ సెక్షన్ పక్కన ఎక్స్‌ట్రాక్టర్ మరమ్మతులకు గురైంది. బుధవారం ఉదయం కార్మికులు మరమతు చేస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఫ్యాక్టరీ ఫైర్ సేఫ్టీ సిబ్బంది మంటలు అదుపు చేశారు. అప్పటికే మంటల్లో గాయపడిన ఐదురుగు కార్మికులను ఏలూరులో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. సంఘటన స్థలాన్ని నూజివీడు డీఎస్పీ ప్రసాద్, సీఐ, ఎస్ఐ శివాజీ పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం

కాపాడిన అభయ రక్షక బృందం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తమ్మిలేరు బ్రిడ్జి వద్ద ఒక ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 112కు సమాచారం అందడంతో టూటౌన్ సీఐ వైవి.రమణ ఆధ్వర్యంలో అభయ రక్షక బృందం హుటాహుటిన తంగెళ్ళమూడి తమ్మిలేరు బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. ఆత్మహత్యాయత్నం చేసిన మహిళను గమనించి వెంటనే ఆమెను తమ సంరక్షణకు తీసుకున్నారు. ఒక ప్రభుత్వ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆమె మానసిక ఒత్తిడికి గురైనట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఆమెకు కౌన్సెలింగ్ అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు. సకాలంలో మహిళను కాపాడిన అభయ మహిళా రక్షకదళ పోలీసులను అధికారులు, స్థానికులు అభినందించారు.


తాడుతో బస్సును లాగుతున్న ట్రాక్టర్

వంతెనపై ఒరిగిన పాఠశాల బస్సు

తప్పిన ముప్పు

ఏలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెంలో జల్లేరు వంతెన వద్ద అప్రోచ్ రోడ్‌లో బుధవారం ప్రైవేటు పాఠశాల బస్సుకు పెద్ద ప్రమాదం తప్పింది. బుట్టాయగూడెం మండలంలోని పలు గ్రామాల పిల్లలను బస్సులో తీసుకువస్తుండగా పట్టెన్నపాలెం బ్రిడ్జి వద్ద రోడ్డు అంచున బస్సు చక్రం కిందికి జారి ఒరిగిపోయింది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వెంటనే నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే పిల్లలను కిందికి దింపేశారు. స్థానికుల సహకారంతో బస్సును ట్రాక్టర్‌తో బయటకు లాగారు.

గురుకులాల్లో టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమడోలు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : ఏపీ సాంఘిక గురుకుల విద్యాలయాల్లో ఐఐటీ, నీట్ అకాడమిల్లో 2025 - 26 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్టు గురుకుల పాఠశాల అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 6వ తేదీ వరకూ ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ జరుగుతుందని నోటిఫికేషన్, విద్యార్హతలను ఆన్‌లైన్ అప్లికేషన్లలో పొందుపర్చినట్టు తెలిపారు.

టీసీసీ పరీక్షలు ప్రారంభం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 19 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 21మందికి గాను ఐదుగురు, హైయర్‌లో 9మందికి ఐదుగురు, టైలరింగ్ లోయర్ 29మందికి 20, హైయర్‌లో 13 మందికి నలుగురు హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించినట్టు ఆమె తెలిపారు.

'లారీలకు కిరాయిలు కల్పించి ఆదుకోండి'

చింతలపూడి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : లారీలకు కిరాయిలు కల్పించి తమను ఆదుకోవాలని చింతలపూడిలో లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు విన్నవించారు. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల అసోసియేషన్ తరపున రవాణా చేశామని, అయితే మొక్కజొన్న రవాణా విషయంలో 15 మంది కాంట్రాక్టర్లు టెండర్లు వేసి లారీలకు ఉపాధి లేకుండా చేస్తున్నారని, ఈ విషయంపై చర్చించాలని ఎమ్మెల్యేను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో శంకర్ రెడ్డి, అశోక్, చౌదరి, నాగేశ్వరరావు ఉన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో మాఘమాసం పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఏలూరు సత్రంపాడులోని లక్ష్మీగణపతిస్వామి ఆలయం వద్ద మాఘమాసం సందర్భంగా భక్తులు బుధవారం స్వామికి పండ్లు, కూరగాయలతో ప్రత్యేక అలంకారం జరిపారు. ఆలయ అర్చకులు రెండు చింతల రాఘవేంద్ర శర్మ స్వామికి పంచామృతాభిషేకం జరిపి ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిన నాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.

'ఫార్మర్స్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలి'

గణపవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పథకాలు పొందాలంటే రైతు సేవా కేంద్రాల్లో తమ భూముల వివరాలను అగ్రిస్టాక్ ఫార్మర్స్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం మొయ్యేరు రైతు సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల నమోదు ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వై.వి.ఎస్.ప్రసాద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

పెదవేగి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ పి.శారద అన్నారు. పెదవేగి మండలం వేగివాడ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని జిల్లా పీడీ శారద బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ కార్డులు తప్పని సరిగా నమోదయ్యేలా చూడాలన్నారు. పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీవో ఎం.ఎస్.రాజశేఖర్, పీడీ కార్యాలయ ఏవో వి.మల్లిక, సుజాత పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి : కృష్ణ కిశోర్

లింగపాలెం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కె.గోకవరం వైద్యాధికారి డాక్టర్ కృష్ణ కిశోర్ అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో ఉన్న హైస్కూల్ విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. బాలికలకు యుక్త వయస్సు రాకుండా పెళ్లి చేయకూడదని అలా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, అధికారులు, పాల్గొన్నారు.

ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలి : రత్నాకర్

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : బీసీ సామాజిక వర్గానికి ఉపయోగపడే ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నాకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బీసీ కార్పొరేషన్ ఏడీ పుష్పలతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా బీసీలు ఎంతో లబ్ధి పొందారని అన్నారు. మళ్లీ సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని పునరుద్ధరించి బీసీ కులవృత్తులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధికార కమిటీ అధ్యక్షులు కె.నాగరాజు, నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, కె.వి.వి.సత్యనారాయణ, చందనాడ నందీశ్వరరావు, పి.మురళీ, రంబా శ్రీను, ఎస్.వి.సుబ్బారావు, సతీష్, రాము, రాజేష్, పాల్గొన్నారు.

'తప్పు చేసిన వారిని కూటమి ప్రభుత్వం వదలదు'

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన వారిని కూటమి ప్రభుత్వం వదలదని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులు పుచ్చా విజయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని గవరవరంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు యాగంటి హరిబాబు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తప్పులు చేసిన వైసీపీ నాయకులు కంగారుపడుతున్నారని, వారికి శిక్ష తప్పదన్నారు. మీడియా సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను పరామర్శించిన ఎమ్మెల్యే

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుంతలగూడెం గ్రామంలో మంగళవారం ఉదయం ఉపాధి కూలీలపై ట్రాక్టర్ దూసుకెళ్లగా ఒక మహిళ మృతి చెంది, ముగ్గురికి తీవ్ర గాయాలైన సంగతి తెలిసిందే. గాయపడిన కార్మికులు కొయ్యలగూడెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని బుధవారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు తోట రవి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రేపు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెంలోని 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 21న వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ బుధవారం తెలిపారు. జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వ్యవసాయానికి విద్యుత్తును ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు దశల వారీగా ఇవ్వనున్నట్లు విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

లింగపాలెం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాలని మండలంలోని తువ్వచిలుకరాయుడుపాలెం రైతులు లింగపాలెంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. సమయ పాలన లేకుండా 9గంటలు ఇవ్వాల్సిన విద్యుత్‌ను 5గంటలు మాత్రమే ఇవ్వడంతో తమ పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు. సమస్యను పరిష్కరించాలంటూ సబ్ స్టేషన్‌లో కూర్చుని నిరసన తెలిపారు. ఏఈ శ్రీనివాస్ 9గంటల విద్యుత్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని రైతులకు నచ్చజెప్పి నిరసనను విరమింపజేశారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం : శాంతను దాస్

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : విద్యతోనే అభివృద్ధి సాధ్యమని రాజమహేంద్రవరానికి చెందిన ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతను దాస్ తెలిపారు. బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో బుధవారం గిరిజన రిజర్వేషన్లపై సెమినార్‌ను నిర్వహించారు. అనంతరం ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో 300మంది విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం సాయినాథ్, డీవైఈవో రామ్మోహనరావు, ఏఎంవో శిరమయ్య, ఎటిడబ్ల్యువో శ్రీవిద్య, షేడ్ డైరెక్టర్ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై నేడు సమావేశం

కుక్కునూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదరావిగూడెం, దాచారం, కౌండిల్యముక్తి గ్రామాల్లోని శివాలయాల్లో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై గురువారం కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం జరగనుందని తహసీల్దార్ రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లు, భక్తులకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, శాంతి భద్రతలపై చర్చించనున్నారు. అలాగే భక్తులకు సౌకర్యాలు, గోదావరి తీరంలో తీసుకోవాల్సిన రక్షణా చర్యలు తదుపరి అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్టు తెలిపారు.

వేతనాల వెతలు...

బకాయిలు చెల్లించాలంటూ కార్మికుల వేడుకోలు
అప్పులు చేసి జీవనం సాగించలేమంటూ ఆవేదన
ప్రత్యామ్నాయ పనులపై ఉపాధి కార్మికుల దృష్టి


ఉపాధి పని చేస్తున్న కార్మికులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సీజన్ ముగిసింది. ఇక ఉపాధి హామీ పనులు ఊపందుకోనున్నాయి. ఈ పనులపై ఉపాధి కార్మికుల నుంచి విమర్శలు వెల్లివెత్తుతున్నాయి. రోజంతా కష్టపడినా రూ.250నుంచి రూ.300కు మించి వేతనం గిట్టుబాటు కావడం లేదని ఉపాధి కార్మికుల నుంచి అసహనం వ్యక్తమవుతోంది. రోజూ పనికి వెళ్తున్నా వేతనాలు సక్రమంగా అందడం లేదని, ఐదు నుంచి ఆరు వారాల డబ్బులు బకాయిలు ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలో కష్టపడి రోజంతా పని చేస్తే వేతనాలు అందడం లేదని, సరుకులు అరువు తెచ్చుకోవాల్సి వస్తోందని ఉపాధి కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇక చేసేది లేక ప్రత్యామ్నాయం చూసుకుంటున్నట్టు కూలీలు చెబుతున్నారు.

లక్షల్లో బకాయిలు..

ఏలూరు రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రూ.1200 జాబ్ కార్డులు ఉండగా, సుమారు 3వేలకు మించి కూలీలు పనులకు హాజరు కావడం లేదు. సుమారు ఒక్కొక్కరికి రూ.9 వేల చొప్పున చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బులు ఎప్పుడు వస్తాయో చెప్పలేని స్థితిలో అధికారులున్నారు. తాము ఉపాధి పనిలో వినియోగించే పరికరాలకు చెల్లించాల్సిన బకాయిలు లక్షల్లో ఉన్నాయని కార్మికులు చెబుతున్నారు. డ్వామా రికార్డులను బట్టి 2024-25 ఆర్థిక సంవత్సరంలో సుమారు 10 వేల పని దినాలు కల్పించాల్సి ఉంది. త్వరలో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుంది. అయినా బకాయిలు లక్షల్లో ఉన్నాయంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. వేతనాలు సరిగా అందక పోవడం, కూలీ గిట్టుబాటు కాకపోవడంతో ఉపాధి పనికి వచ్చే కార్మికుల శాతం కూడా తగ్గిపోతోంది.

బకాయి వివరాలు పంపాం : ఉపాధి ఏపీవో

జనవరి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగా సొమ్ము వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. అంటే జనవరి మొదటివారం నుంచి నేటి వరకు ఆరు వారాలుగా ఉపాధి వేతనాలు అందాల్సి ఉంది. ప్రస్తుతం ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ఉదయాన్నే పనికి వెళ్లి 10 గంటల్లోపు వచ్చేస్తున్నారు. వేతనాల ఆలస్యం గురించి ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో హబీబ్ బాషా మాట్లాడుతూ ఉపాధి కార్మికుల బకాయిలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్టు తెలిపారు. త్వరలోనే చెల్లిస్తామని తెలిపారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల గెలుపు కోసం కూటమి నాయకుల ప్రచారం

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని గవరవరం, పొంగుటూరు, కొయ్యలగూడెం గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పుచ్చల విజయకుమార్, నియోజకవర్గ పరిశీలకులు వెంకటనారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయిబాబు, జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు బొల్లిన నిర్మలకిషోర్, జనసేన, టీడీపీ, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు తోట రవి, పారేపల్లి నరేష్, గొలిశెట్టి వాసు, ఎస్ఆర్ఆర్ సుభద్రాదేవి, చింతల వెంకటరమణ, ఆకుల అరుణ, తదితరులు పాల్గొన్నారు.


గవరవరంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ద్వారకాతిరుమల : శాసన మండలిలోనూ కూటమి బలం పెంచుకుని రాష్ట్రం అభివృద్ధిని సాధించాలంటే కూటమి అభ్యర్థి రాజశేఖరానికే పట్టం కట్టాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కోరారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కామవరపుకోట : కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పేర్కొన్నారు. ఆడమిల్లి, వీరంపాలెం, తడికలపూడి, తదితర గ్రామాల్లో బుధవారం పాఠశాలల్లో, సచివాలయాల్లో పట్టభద్రులను కలుసుకుని నమూనా బ్యాలెట్‌లను, బ్రోచర్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, ఆడమిల్లి సర్పంచ్ గూడపాటి కేశవరావు, చింతలపూడి నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు జిజ్జూరి బాబ్జి తదితరులు ఉన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్ బాబు, మాజీ వైస్ సర్పంచ్ నెక్కలపు సూర్యనారాయణ, కూటమి నాయకులు బాలవర్ధిరాజు, నెక్కలపు గంగాధర రావు, మల్లెల్లి కాంతారావు, బిరుదుగడ్డ రాజేష్, వనపర్ల కుమార్‌బాబు, నరేష్ ఉన్నారు.

పెదవేగి/పెదపాడు : పట్టభద్రులంతా అభివృద్ధికే ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. పెదవేగి మండలం భోగాపురంలోని విజ్ఞాన్ గ్లోబల్‌జెన్ స్కూల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే పెదపాడు మండలం వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్, గారపాటి రామసీత తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు టూటౌన్ : అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరానికి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. బుధవారం ఏలూరులోని విద్యానగర్, శాంతినగర్‌లలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చంటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో తంగేటి మనోహర్, చోడె వెంకటరత్నం, చల్లా వెంకటసత్యవరప్రసాదరావు, బెల్లంకొండ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఉంగుటూరు మండలం కైకరంలో మాజీ జడ్పీటీసీ చింతల శ్రీనివాస్, సర్పంచ్ ఎస్.గోపి సారథ్యంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అడపా శోభారాణి, ఎంపీటీసీ చెన్ను సత్యవాణి, పామర్తి సత్యనారాయణ, కోనా ఆనంద్, మట్టా శ్రీను, ఐ.టి.డి.పి. నాయకురాలు యెగ్గిన శ్యామల, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు బొడ్డు శాంత కుమారి పాల్గొన్నారు.

ఏలూరు : జంగారెడ్డిగూడెం పట్టణంలోని ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో కూటమి బలపరచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రావూరి కృష్ణ, మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, ఈడా శ్రీనివాసరావు, మహంకాళి రామ్మోహనరావు, రాజ్‌పాల్ కుమార్, నంబూరి రామచంద్రరాజు, షేక్ ముస్తఫా, టి.రాము. తాతాజీ, వేమూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

చింతలపూడి : బోసుబొమ్మ సెంటర్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ రక్షణ సమితి సభ్యులు మాట్లాడుతూ శివాజీ చరిత్ర, హిందూ ధర్మానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టి.వి.ప్రసాద్, సి.హెచ్.మోహన్ రావు, సి.హెచ్.అంజిబాబు, బిజెపి నాయకులు చక్రధర రావు, శింగం ప్రసాద్, మోహన్ రావు, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడిలో శివాజీ విగ్రహం ఎదుట నివాళి దృశ్యం

లింగపాలెం : మండలంలోని ధర్మాజీగూడెంలో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా జరిపారు. ముందుగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు రాయంకుల చక్రధరరావు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ పాలనాదక్షుడిగా పేరొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షిర్డీ సాయి మందిరం వార్షికోత్సవం

గణపవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : గణపవరంలోని వెంకయ్య వయ్యేరు ఒడ్డున కొలువైన షిరిడి సాయిబాబా మందిరం 28వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. బుధవారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు 22వ తేదీ వరకు జరగనున్నాయి. తొలిరోజు బాబా వారికి ఏకాదశ మహారుద్రాభిషేకం భూపతిరాజు వెంకట గణేష్ నారాయణరాజు, సరితా దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం స్వామికి పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కోలాట బృందాలు నృత్యాలు అలరించాయి. తొలుత ఎమ్మెల్యే ధర్మరాజును ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేగేశ్న సుబ్బరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసురాజు, ఆధ్యాత్మికవేత్త, కార్యవర్గ సభ్యులు కటారి రంగరాజు, వేగేశ్న ప్రసాదరాజు, వేగేశ్న శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


సాయిబాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

చిన్నారుల సమగ్రాభివృద్ధికి జ్ఞాన జ్యోతి

టి.నరసాపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ చిన్నారుల సమగ్రాభివృద్ధికి జ్ఞానజ్యోతి ఉపయోగపడుతుందని ఐసీడీఎస్ సీడీపీవో పి.మాధవి పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యను బలోపేతం చేయడానికి, నూతన విద్యా విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి టి.రామ్మూర్తి, ప్రధానోపాధ్యాయులు ఆర్.వి.జి కృష్ణారావు, సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, జి.ఉషారాణి, వి.ఎస్.కృష్ణారావు, ఎం.లక్ష్మి, జి.ఉషారాణి, ఎం.వి.వి.సుబ్బారావు, టి.రామాంజిబాబు, సీఆర్ఎంటీలు రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

ఏలూరు : అంగన్వాడీ చిన్నారులకు మెరుగైన విద్యను అందించడానికి టీచర్లు కృషి చేయాలని జిల్లా జీడీడీవో బి.నవీన అన్నారు. బుధవారం పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు జరుగుతున్న 120 రోజుల జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్సు శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ ముఖ్య ఉద్దేశాలు లక్ష్యాల గురించి వివరించి అంగన్వాడీలకు వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు మూర్తి, వజీర్, స్వామి అయ్యప్ప, సీఆర్పీ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

కామవరపుకోట : అంగన్‌వాడీల్లో చిన్నారుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన జ్ఞానజ్యోతిపై అంగన్ వాడీలు పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీరకుమారి, బి.వి.ఎల్. మంగాదేవిలు పేర్కొన్నారు. బుధవారం కామవరపుకోటలో జ్ఞానజ్యోతి శిక్షణను నిర్వహించారు. టీకాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.


సూచనలిస్తున్న ఐసీడీఎస్ పీడీ శారద

కుక్కునూరు : అంగన్వాడీ కార్యకర్తలకు బుధవారం జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్ వాడీలకు వచ్చే చిన్నారులకు ఆట పాటల మధ్య సంభాషణ కర్తలుగా చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీకుమారి, సూపర్‌వైజర్ రుక్మిణి, అంగన్వాడీలు పాల్గొన్నారు.


ఉంగుటూరు : అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఎలా బోధించాలనే అంశంపై జ్ఞానజ్యోతి శిక్షణలో రిసోర్స్ పర్సన్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు తోట మీనా కుమారి పర్యవేక్షించారు. ఈ శిక్షణ భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని రిసోర్స్ పర్సన్స్ అల్లు శ్రీను, శిరికి శివ, శివ కుమార్, బి.శ్రీలక్ష్మి, డి.శారదామణి పేర్కొన్నారు.

పెదవేగి : పిల్లల సంపూర్ణ వికాసం అంగన్‌వాడీల లక్ష్యమని జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖ పీడీ పి.శారద అన్నారు. జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా పెదవేగి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రెండోరోజు శిక్షణ కార్యక్రమానికి పీడీ శారద హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీవో ఎం.ఎస్.రాజశేఖర్, ఏవో వి.మల్లిక, సీహెచ్.పార్వతి, కె.మేరీ బాయి, కె.శాంతారత్నం, డీఆర్పీలు పాల్గొన్నారు.


రీ సర్వే రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

రీసర్వే పనులు పరిశీలన

లింగపాలెం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి) : రీసర్వే పనులను వేగవంతం చేయాలని అధికారులను నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ఆదేశించారు. మండలంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన లక్ష్మీగణపనేనివారిగూడెంలో జరుగుతున్న రీసర్వే పనులను ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు రీసర్వే పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ గ్రామంలో 494 ఎకరాలకు గాను 404 ఎకరాలు రీసర్వే పూర్తయిందని మిగిలిన 90 ఎకరాలు వెంటనే పూర్తి చేస్తామని సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌కు తెలిపారు. ఆయన వెంట రీసర్వే డీటీ నాగబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే మద్దిపాటి

టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): దొరసానిపాడు వైసీపీ ఎంపీటీసీ అల్లాడ హరేరామకృష్ణ, వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్రి జబ్బేశ్వరరావులు బుధవారం టీడీపీలో చేరారు. వైసీపీ విధానాలు నచ్చక తాము టీడీపీలో చేరినట్టు నాయకులు తెలిపారు. టిడిపి అభివృద్ధికి తమవంతుగా పాటు పడతామని తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు లంకా సత్తిపండు ఆధ్వర్యంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పార్టీ కండువాలు కప్పారు. ఇంకా అల్లాడ శ్రీనివాసరావు, అల్లాడ రాంబాబు, చిట్టిబొమ్మ గంగాధరరావు, షేక్ తాజ్, అల్లాడ రామకృష్ణ తదితరులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మద్దిపాటి రత్నాజీ, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, పోలిన శ్రీను, పసుమర్తి శేఖర్, కారుమంచి మురళి, అల్లాడ గిరి, బొబ్బిలి బాబూరావు, అల్లాడ రాజేష్ నల్లూరి నాగబాబు పాల్గొన్నారు.

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

దెందులూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : చల్లచింతలపూడి శ్రీమేధా దక్షిణామూర్తి స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం దెందులూరులోని పార్టీ కార్యాలయంలో చల్లచింతలపూడి శివాలయంలోని ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వేమన రాము గౌడ్, పార్టీ మండల కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణ, నాయకులు తుంపాటి ఆంజనేయులు, యర్రంశెట్టి నాగరాజు, బాలిన నాగుతో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయండి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే నియమించాలని, ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా కోకన్వీనర్ టి.రాజు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం జిల్లా రెవెన్యూ అధికారికి నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మెగా డీఎస్సీని తక్షణమే ప్రకటించాలని కోరారు.

జగన్ వ్యాఖ్యలపై అభ్యంతరం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ఎప్పుడూ నాలుగు సింహాలకే సెల్యూట్ చేస్తాడే తప్ప చట్టాలను గౌరవించని వారికి సెల్యూట్ చేయరని, జగన్ మోహన్ రెడ్డి పోలీస్ అధికారులపై చేసిన వ్యాఖ్యలు పోలీసుల మనోభావాలను ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా ఉన్నాయని, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ రెడ్డి అప్పల నాయుడు అన్నారు. విజయవాడలో పోలీస్ అధికారులపై జగన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఏపీలో శాంతి భద్రతలు దిగజారి పోయాయని జగన్ మోహన్ రెడ్డి అనడం సరికాదన్నారు. జగన్ తన రాజకీయ లబ్ధికోసం పోలీసులను కించపరుస్తూ మాట్లాడటం దురదృష్టకరమన్నారు.

క్రీడాకారులకు టీషర్ట్‌ల అందజేత

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మరణించిన మిత్రుల జ్ఞాపకార్థం ప్రతి ఏటా క్రికెట్ పోటీలు నిర్వహించి, స్నేహితులను కలుసుకోవడం గొప్ప విషయమని మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సొంగా సందీప్ అన్నారు. గత 12ఏళ్ళుగా వివిధ కారణాలతో మరణించిన మిత్రుల జ్ఞాపకార్థం స్నేహాంజలి, మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు జెర్సీటీమ్ క్రీడాకారులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం టీషర్ట్‌లను ఆయన చేతులమీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు చందు, తదితరులు పాల్గొన్నారు.

పట్టిసీమ ఏర్పాట్ల పరిశీలన

పోలవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బుధవారం పరిశీలించారు. భక్తులకు ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల ప్రమాదంలో గాయపడిన గూటాల జనసేన నేత మొగళ్ళ హరిబాబుని ఆయన నివాసం వద్ద పరామర్శించారు. ఈకార్యక్రమంలో కూటమి నేతలు గడ్డమణుగు రవి, గునపర్తి చిన్ని, పాపోలు రత్తయ్య, బొడ్డు కృష్ణ, పెద్దేహవు సత్యన్నారాయణ, పోతుల శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు

పెదపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్టు తహసీల్దారు కృష్ణజ్యోతి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు గదులు, పెదపాడు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఒక గదిని కేటాయించినట్టు తెలిపారు.


మున్సిపల్ కార్మికుల వినతి

ఏలూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా వినతి పత్రాలు అందజేసినట్టు తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గణపవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి ఆదుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నేతలు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు వినతిపత్రం అందజేశారు. బుధవారం గణపవరంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మరాజుకు భవన నిర్మాణ కార్మికుల జిల్లా ప్రధానకార్యదర్శి ఆదినారాయణ, జిల్లా కోశాధికారి ఏడిది వెంకట గోపాలకృష్ణ, మండల అధ్యక్షుడు నారాయణరావులు ఈ వినతిపత్రం అందజేశారు.

తిరుమలలో ఒకరి అదృశ్యం



తిరుమల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన ఓ భక్తుడు కనిపించకుండా పోయాడు. పోలీసుల వివరాల మేరకు ఏలూరు జిల్లాలోని పోణంగి గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు(60) కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 15వ తేదీన తిరుమల వచ్చాడు. ఉదయం 7.30 గంటలకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 2లోకి ప్రవేశించి అనంతరం కనిపించలేదు. కుటుంబ సభ్యులు తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరావు ఆచూకీ తెలిసినవారు 0877 2289027, 94407 96769 నెంబర్లకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

భీమడోలులో వైభవంగా జాతర

భీమడోలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు గ్రామంలో అమ్మవార్ల జాతర వైభవంగా జరుగుతుంది. బుధవారం గణాచారులు గ్రామ సంచారం నిర్వహించారు. రావిచెట్టుసెంటర్, గుర్రాల చెరువు గట్టు, బీసీ కాలనీ మీదుగా ఊరేగింపు కొనసాగింది.

బాల్య వివాహాలను అరికట్టాలి : కృష్ణ కిశోర్

లింగపాలెం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కె.గోకవరం వైద్యాధికారి డాక్టర్ కృష్ణ కిశోర్ అ న్నారు. మండలంలోని కొత్తపల్లిలో ఉన్న హైస్కూల్ విద్యార్థులకు వాల్య వివా హాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. బాలికలకు యుక్త వయస్సు రాకుండా పెళ్లి చేయకూడదని అలా చేస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు సహకరించాలని కోరారు. అంగన్‌వాడీ, అధికారులు, పాల్గొన్నారు.

ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలి : రత్నాకర్

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బీసీ సామాజిక వర్గానికి ఉపయోగపడే ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలని నాయీ బ్రాహ్మణ కార్పొ రేషన్ డైరెక్టర్ లంకా రత్నాకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బీసీ కార్పొ రేషన్ ఏడీ పుష్పలతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా బీసీలు ఎంతో లబ్ధి పొందారని అన్నారు. మళ్లీ సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని పునరుద్ధరించి బీసీ కుల వృత్తులను ఆదుకోవాలని కోరారు. జిల్లా సాధికార కమిటీ అధ్యక్షులు కె.నాగరాజు, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, కె.వి.వి.సత్యనారాయణ, చందనాడ నందీశ్వరరావు, పి.మురళీ, రంబా శ్రీను, పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం.. హత్యకు దారితీసింది

నిడమర్రు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బావాయిపాలెంలో యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సబంధం నేపథ్యంలో హత్య జరిగిందని నిర్ధారణకు వచ్చిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. సీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రావ ణ్‌కుమార్ వివరాలు తెలిపారు. బావాయి పాలెం గ్రామానికి చెందిన పిల్లి ఏసుబాబు, పిల్లి అన్నవరం, ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన గెద్దాడ శ్రీనివాసరావును అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

బావాయిపాలెం గ్రామానికి చెందిన పిల్లి ఏసు భార్యతో మజ్జి ఏసు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో గతంలో ఏసు, అతడి తండ్రి అన్నవరం కుల పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ మజ్జి ఏసు ప్రవర్తన మారకపోవడంతో అతడిని అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. పిల్లి ఏసు, అన్నవరం కలిసి ఉండి మండలం కోలమూరు శ్రీనివాసరావుతో కలిసి పది రోజుల ముందే పథకం వేశారు. పిల్లి ఏసు భార్య సెల్‌ఫోన్ నుంచి మజ్జి ఏసుకు మెసేజ్‌లు పంపించారు. ఈనెల 15న సాయంత్రం మహాదేవపట్నంలో ఆమె ఇంటికి రమ్మని మెసేజ్ చేశారు. దీనితో మజ్జి ఏసు మహాదేవపట్నం వెళ్లగా అతడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. చుట్టుపక్కల బంధువులు అతడిని పోలీసులకు అప్పగించాలని సూచించారు. మా ఊరి పెద్దల్లో పంచాయితీ పెడతామంటూ అదేరోజు రాత్రి బావాయిపాలెం తీసుకొచ్చారు. బావాయిపాలెం గ్రామ శివారులో చినకాపవరం కాలువ వద్ద కొబ్బరి కాయలు కోసే కత్తితో ఏసు చెయ్యిని పిల్లి అన్నవరం తెగనరికాడు. మిగతా ఇద్దరు అతడికి సహకరించారు. తెగనరికిన చెయ్యిని దూరంగా విసిరేసి పారిపోయారు. తీవ్ర రక్త స్రావంతో మజ్జి ఏసు మృతి చెందాడు.

ఈ కేసులో నిందితులు ఉపయోగించిన కత్తి, మోటారుసైకిళ్లు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పిల్లి ఏసు, పిల్లి అన్నవరం, గెద్దాడ శ్రీనివాసరావును కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో నిడమర్రు సీఐ ఎంవీ.సుభాష్, ఎస్ఐ ఎం.వీరప్రసాద్, గణపవరం, చేబ్రోలు ఎస్ఐలు ఎ.మణికుమార్, సూర్య భగవాన్ మూడు బృందాలుగా కేసు విచారణ చేపట్టారు. త్వరితగతిన కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ కేపీఎస్.కిశోర్ అభినందించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

ముదినేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : భర్తతో అన్యోన్యత, పిల్లల పట్ల ప్రేమానురాగాలు కలిగి అందరితోనూ ఆప్యాయంగా ఉండే ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అందరినీ కలచి వేసింది. పోలీసుల కథనం ప్రకారం బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన ముమ్మడివరపు రాంబాబు, సంతోషి దంపతులు కొంతకాలంగా ముదినేపల్లి మండలం పెయ్యేరు పంచాయతీ అలేఖ్య లేఅవుట్‌లో ఒక అపార్టుమెంటులో నివాసం ఉంటున్నారు. రాంబాబు మండవల్లి మండలం గొన్నన పూడిలో తన బావ లీజుకు తీసుకున్న చేపల చెరువులను చూసుకుంటున్నాడు. వారికి ఒక పాప, ఒక బాబు ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాంబాబు చెరువుల వద్దకు వెళ్లిన అనంతరం ఉదయం 8 గంటలకు సంతోషి (26) సీలింగు ఫ్యాను రాడ్డుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కాసేపటికి పిల్లలు నిద్ర లేచి హాల్‌లోకి రాగా తన తల్లి ఉరి వేసుకుని వేలాడుతున్న దృశ్యాన్ని చూసి బోరున ఏడుస్తూ కేకలు వేశారు. దీంతో అపార్టుమెంటులోని పక్క ప్లాట్స్‌లోని వారు వచ్చారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. తహసీల్దార్ సుఫాని, కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. శవపంచనామా నిర్వహించిన అనంతరం సంతోషి మృత దేహాన్ని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపారు. సంతోషి సమీప బంధువు సింహాద్రి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.



దిగవల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన ర్యాలీ

క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

నూజివీడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా దిగవల్లి పీహెచ్‌సీలో ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సునందకుమారి మాట్లాడుతూ ఎవరికైనా రెండు వారాలకు మించి కళ్లెతో కూడిన దగ్గు, బరువు తగ్గినా ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలన్నారు. కొద్దిపాటి నిర్లక్ష్యం ప్రాణాంతకం కావచ్చని, క్షయవ్యాధిని గుర్తించి సరైన సమయంలో వైద్య సేవలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ విద్యాసాగర్

రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

ముసునూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాల సబ్సిడీ పథకాన్ని, రాయితీలను పొందాలంటే రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి అని ఏడీఏ జి. విద్యాసాగర్ అన్నారు. చింతలవల్లి రైతు సేవా కేంద్రంలో రైతు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. పీఎం కిసాన్ అర్హత ఉన్న రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆర్ఎస్‌కె సిబ్బంది, వ్యవసాయ అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో కేసీహెచ్ సూరిబాబు, వీహెచ్‌ఏలు, వీఏఏలు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సారా స్థావరాలపై దాడులు చేసి బెల్లం ఊటను ధ్వంసం చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారి అజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. తోటపల్లిలో బుధవారం సారా స్థావరాలపై దాడులు చేశారు. 600 లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేసి రాజులపాటి సత్యనారాయణపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ సీఐ మస్తానయ్య, ఎస్సై అలీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో దొంగనోట్ల కలకలం

నూజివీడు, తమిళనాడు ముఠా

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో దొంగనోట్ల చలామణిపై కలకలం రేగింది. పట్టణంలో వారం రోజులుగా ఒక ముఠా సంచరిస్తూ మద్యం దుకాణాలు, పెట్రోల్ బంకులు లక్ష్యంగా దొంగనోట్లు మార్చుతున్నట్లు సమాచారం. ఇటీవల కౌంటర్లలో తరచు దొంగనోట్లు వస్తున్నట్టు గుర్తించిన మద్యం వ్యాపారులు పోలీసులకు సమాచారం అందించడంతో నిఘా ఉంచారు. ముఠా సభ్యులను పట్టుకుని వారి నుంచి సుమారు రూ.2.5 లక్షల విలువైన రూ.500 నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. దొంగనోట్ల ముఠా కీలక సభ్యులు తమిళనాడు, నూజివీడు ప్రాంతాలకు చెందిన వారిగా భావిస్తున్నట్టు సమాచారం. ఈ ముఠాలోని 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలుస్తోంది.

దొంగనోట్లను మార్చేందుకు రద్దీగా ఉండే మద్యం షాపులు, పెట్రోల్ బంకులను ఎంచుకున్నారు. జిల్లాలో రూ.10 లక్షల విలువగల నోట్ల మార్పిడికి పాల్పడినట్టు సమాచారం. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు నిఘా పెట్టారు.

అసలు నోట్లకు తీసిపోనివిధంగా..

జిల్లాలో మారకంలోకి వస్తున్న నకిలీ నోట్లు అసలు నోట్లకు ఏమాత్రం తీసిపోని విధంగా నోట్లు తళుక్కుమంటున్నాయి. ప్రింటింగ్, నాణ్యతలో తేడా లేకుండా అధునాతన టెక్నాలజీని ముఠా వాడుతున్నట్లు గుర్తించినట్లు సమాచారం.



వైభవంగా నాగమ్మ తల్లి వార్షికోత్సవం

ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులో నాగమ్మ తల్లి దేవ స్థానం 25వ వార్షికోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి విశేష అలంకరణ చేసి బుధవారం పెద్ద సంఖ్యలో భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

\- ముదినేపల్లి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్


నూజివీడులో ప్రచారం చేస్తున్న మాజీ కౌన్సిలర్ గొల్లు దుర్గాదేవి

‘ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించండి’

కైకలూరు/చాట్రాయి/నూజివీడు టౌన్/ముసునూరు/మండవల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రతీ ఓటరును కలిసి కూటమి అభ్యర్థికి ఓటు వేసేలా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. కైకలూరు మండలం వరహాపట్నంలో బుధవారం కూటమి నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి పార్టీకి చెందిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజెఎస్ మాల్యాద్రి, కూటమి పార్టీ నేతలు పాల్గొన్నారు. ఆలపాటి గెలుపు కోసం ఆటపాకలో పట్టభద్రులను కలిసి ఓట్లను రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అభ్యర్థించారు. కూటమి నేతలతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు.

కృష్ణా- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం కూటమి అభ్యర్థి ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని చాట్రాయి మండలం జనార్ధనవరంలో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వలగాని దుర్గారావు, కలకొండ భాస్కరరావు, నాగమల్లి వెంకటేశ్వరరావు, కోవిలంపాటి రామారావు, చిట్టిబాబు, పొట్టపువ్వు అవినాష్, సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు. నూజివీడులో మాజీ కౌన్సిలర్ గొల్లు దుర్గాదేవి ఆధ్వర్యంలో పట్టభద్రులను కలిసి ఆలపాటి రాజాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాకా రాంబాబు, దివాకర్, శోభనం, జ్ఞానేంద్రరావు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ ముసునూరు మండల అధ్యక్షుడు దేవినేని బలరామ్ కోరారు. కాట్రేని పాడు, గుడిపాడు, చెక్కపల్లి తదితర గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గద్దె రఘుబాబు, రాపర్ల బాలకృష్ణ, గద్దల మోహన్‌రావు, సూర్యదేవర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. మండవల్లి మండలం చావలిపాడులో కూటమి నాయకులు బుధవారం ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజంద్రప్రసాద్‌కు ఓట్లు వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. రాష్ట్ర యాదవ్ సాధికార కమిటీ సభ్యుడు తలారి రాజేష్, నాయకులు గూడపాటి లక్ష్మణరావు, కడలి శ్రీను, బొడ్డు నాయుడు, ఈశ్వర్ ఓట్లు అభ్యర్థించారు.

ఆర్బీకేల వల్ల ఒరిగిందేమీ లేదు..

ముదినేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎంతో మేలు చేశామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్పుకోవడం హాస్యాస్పదమని తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు విమర్శించారు. అల్లూరులో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆర్బీకేల వల్ల రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. అమ్మిన ధాన్యానికి 21 రోజుల్లో సొమ్ములు ఇస్తామన్న అప్పటి వైసీపీ ప్రభుత్వం నెలల తరబడి రైతుల ఖాతాలకు జమ చేయలేదన్నారు.

ఎత్తిపోతల వద్ద పూడిక తొలగింపు

కలిదిండి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కొండంగి ఎత్తిపోతల వద్ద ఎత్తిపోతల కమిటీ చైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు ఆధ్వర్యంలో సీబీ కెనాల్‌లో రైతులు పూడిక తొలగించారు. వైసీపీ హయాంలో ఐదేళ్లుగా ఎత్తిపోతలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. చివరి ఎకరం వరకు సాగునీరు అందిస్తామన్నారు. ప్రస్తుతం 24 గంటలు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందిస్తున్నామని రైతులు చేపల, రొయ్యల చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలన్నారు. డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.


ఆక్రమణదారులతో చర్చిస్తున్న గ్రామస్థులు, పోలీసులు

ఆక్రమణల తొలగింపులో స్వల్ప ఉద్రిక్తత

కైకలూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రహదారి విస్తరణ కోసం ఆక్రమణల తొల గింపులో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. బుధవారం కైకలూరు మండలం ఆలపాడులో ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణకు ఆక్రమణలను తొలగించే పనులను అధికారులు చేపట్టారు. దీంతో పలువురు అడ్డుకునే ప్రయత్నం చేశారు. గ్రామ పంచాయతీ అధికారులు, గ్రామ పెద్దలు వారిని సముదాయించారు. రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని, పక్కా డ్రైన్, సీసీ రోడ్డు నిర్మాణంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉంటాయని వారికి నచ్చచెప్పారు. కైకలూరు రూరల్ ఎస్సై రాంబాబు తన సిబ్బందితో చేరుకుని ఆక్రమణ దారులకు సర్దిచెప్పి పనులు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకున్నారు.

హైస్కూళ్లలో భాషోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జడ్పీ పరిషత్ హైస్కూళ్లలో బుధవారం భాషోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముదినేపల్లి, పెదపాలపర్రు, పెదగొన్నూరు, గురజ, బొమ్మినంపాడు, వడాలి, చిగురు కోట, అల్లూరు హైస్కూళ్లలో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఇంగ్లీషు టీచర్లు, హిందీ పండిట్లు విద్యార్థుల్లో ఆయా భాషలపై పట్టు సాధించేలా వ్యాసరచన, పాటలు, ఆటలు, వక్తృత్వ పోటీలు నిర్వహిం చారు. ఇంగ్లీషు భాష ప్రపంచ వ్యాప్త భాష అయినందున దాని ప్రాముఖ్యతను విద్యార్థులు తెలు సుకోవాలని, మాతృభాషతో పాటు ఆ భాషపై పట్టు సాధించాలని ముదినేపల్లి హైస్కూల్ హెచ్ఎం విజయ కుమార్ తెలిపారు.


పెదపాలపర్రు హైస్కూల్లో హిందీ భాషపై విద్యార్థినులకు పోటీ

అభ్యాసన నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

సీడీపీవో దీప్తి

కైకలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ టీచర్లు అభ్యాసన నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సీడీపీవో దీప్తి అన్నారు. బుధవారం కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు 3 రోజులు జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతుల్లో భాగంగా అభ్యాసన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. బాల్యం ప్రారంభ దశలో మొదడు అభివృద్ధి అంశాలపై ట్రైనర్స్ రామోజీ, ఆర్కె నాయుడు, సతీష్‌లు శిక్షణ ఇచ్చారు.ఎంపీడీవో రామారావు, సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, సాహెదా ఖానం, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

మహిళల అభివృద్ధికి రుణాలు



వెంకటేశ్వరరావు, ఏపీఎం, వెలుగుశాఖ, చాట్రాయి

- **మండలంలో ఎస్‌హెచ్‌జీ మహిళా గ్రూపులకు బ్యాంకు లింకేజి రుణాల లక్ష్యం ఎంత?**

జవాబు: మండలంలో 1400 గ్రూపులు ఉండగా, ఈ ఏడాది 583 గ్రూపులకు రూ. 47.86 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యం. ఇప్పటి వరకు 294 గ్రూపులకు రూ.27 కోట్ల రుణాలు ఇచ్చాం.

- **స్త్రీనిధి పథకం కింద ఎన్ని రుణాలు ఇచ్చారు?**

జవాబు: మండలంలో స్త్రీనిధి పథకం కింద రూ.6 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 730 గ్రూపులకు రూ.5 కోట్ల రుణాలు ఇచ్చాం.

- **ఉమెన్‌లీడ్ పథకం ముఖ్య ఉద్దేశం ఏమిటి?**

జవాబు: గ్రామాల్లో మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చి, వారు స్వశక్తితో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనేది పథకం లక్ష్యం

- **ఉమెన్‌లీడ్ పథకం కింద ఎంత మందికి రుణాలు ఇచ్చారు?**

జవాబు: 200 మంది మహిళలకు రుణాలు ఇవ్వాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 37 మందికి రూ.లక్ష చొప్పున ఇచ్చాం. ఇంకా 30 అప్లికేషన్లు బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

- **చంద్రన్న బీమా, పెళ్లి కానుక పథకాలు అమలు చేస్తున్నారా?**

జవాబు: ఈ పథకాలు ప్రస్తుతం అమలులో లేవు. దీనిపై కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవల్సి ఉంది.

(ఆంధ్రజ్యోతి-చాట్రాయి)

ఎన్నికలకు ఏర్పాట్లు

పెదపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దారు కృష్ణజ్యోతి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు గదులు, పెదపాడు మెయిన్ పాఠశాలలో ఒక గదిని కేటాయించామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190



నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475


నూజివీడు, చాట్రాయిలో అంగన్‌వాడీల శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ

నూజివీడు టౌన్/చాట్రాయి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నూజివీడు బాలికోన్నత పాఠశాలలో సమగ్రశిక్ష ఐసీడీఎస్ ప్రథం సంయుక్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సీడీపీవో డి.ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే దిశగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలపై దృష్టి చూపాలన్నారు. పిల్లల సమగ్రాభివృద్ధి, టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించడంపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్పీలు కె.ధనలక్ష్మి, టి.రమాదేవి, ఎం.సత్యనారాయణ, కె.సురేష్, ఎస్.కె అన్వర్‌భాష, ఎల్.సులోచన తదితరులు పాల్గొన్నారు. చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు డీఆర్పీలు శిక్షణ ఇచ్చారు. శిక్షణ 6 రోజుల పాటు జరగనున్నది. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మచారి, హెచ్ఎంలు కృష్ణయ్య, రాము, సూపర్‌వైజర్ గాయత్రి పాల్గొన్నారు.

పట్టు పురుగుల సాగుపై రైతులకు అవగాహన

ముసునూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ముసునూరు రైతుసేవా కేంద్రంలో పట్టు పురుగుల సాగుపై బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూజివీడు ఏడీఏ జి.విద్యాసాగర్ మాట్లాడుతూ పట్టు పురుగుల సాగుపై రైతులు అవగాహన పెంచుకుని, ప్రభుత్వ సహకారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెరి కల్చర్ డిప్యూటీ డైరెక్టర్ డి.వాణి మాట్లాడుతూ మల్బరీసాగు ఎకరం సాగుచేసే ఓసీ, బీసీ రైతులకు రూ.22,500, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.25,200 విలువైన మొక్కలను అందజేస్తామన్నారు. షెడ్డునిర్మాణం కోసం ఓసీ,బీసీ రైతులకు రూ.3,37,500, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.4,00,005 అందిస్తున్నామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో షెడ్డు నిర్మాణానికి ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు అదనంగా రూ.3లక్షలు ఇస్తున్నామని ఆమె వివరించారు. ఏవో కేసీహెచ్ సూరిబాబు, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీఏ విద్యాసాగర్

గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించండి

ముసునూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో ప్రహరీ, సీసీ రోడ్డు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ వెట్రిసెల్వికి ప్రిన్సిపాల్ కె.ప్రవీణ, ఎస్ఎంసీ చైర్మన్ సాయిల వంగిడయ్య, సభ్యులు బుధవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళ అగంతకులు పాఠశాలలో మకాం వేస్తున్నారని, కుక్కలు సంచారం ఎక్కువైందని కలెక్టర్‌కు వివరించారు. ప్రధాన రహదారి నుంచి పాఠశాల భవనం వరకు అంతర్గత రహదారి లేక వర్షాకాలం బురదలో విద్యార్థులు ప్రమాదాల బారినపడుతున్నారని ప్రిన్సిపాల్ వివరించారు. పీఈటీ నాగమల్లీశ్వరి, సభ్యులు రెడ్డి తిరుపతిరావు, కిషోర్, కందేపు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు ఇచ్చే వినతిపత్రంతో ప్రిన్సిపాల్, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు

ఉపాధి కల్పనలో పాలక పక్షాలు విఫలం

చాట్రాయి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపాధి, ఆహార భద్రత కల్పించడంలో పాలక పార్టీలు విఫలమయ్యాయని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల జీవన, ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చడానికి ఏమాత్రం దోహదపడడం లేదన్నారు.

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్యశిబిరం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తుక్కులూరు జేబీఎల్ వృద్ధాశ్రమంలో తిరువీధి లక్ష్మీరామారావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరువీధి కృష్ణ మాట్లాడుతూ నిరుపేదల కోసం శిబిరం నిర్వహించామన్నారు.

వీలునామా రిజిస్ట్రేషన్ ప్రకటన
విల్లు కెస్ నెం.2/2025.

ఏలూరుజిల్లా,నూజివీడు మండలం, నూజివీడు పట్టణ, డోరు.నెం. 20-237రు కాపురాస్తులు బొబ్బిలి (లేటు) వెంకటప్పయ్య గారి కుమారుడు బొబ్బిలి కొండలరావు గారు వారి తాలూకు నూజివీడు సబ్-రిజిస్ట్రారు వారి యిలాకా నూజివీడు మండలం నూజివీడు పట్టణ ఆర్.యస్.నెం. 450-1రు దాఖలా డోరు. నెం.20-237రు దాఖలా చ.గ. 704 లున్నూ, నూజివీడు మండలం, నూజివీడు పట్టణములో ఆర్.యస్.నెం. 577-1 రు దాఖలా య 5-68ట్లున్నూ, నూజివీడు పట్టణములో ఆర్.యస్ నెం.583 రు దాఖలా య 3-00ట్లున్నూ, నూజివీడు పట్టణములో ఆర్.యస్ నెం.583 రు దాఖలా చ.గ 1452లున్నూ, నూజివీడు పట్టణములో బొబ్బిలి హౌసింగ్ ఎస్టేట్‌లోని కృష్ణవిలాస్ కాలనీలోని "కృష్ణవిలాస్ సౌధమ్" అపార్ట్మెంట్ నందలి ఫ్లాటు.నెం. జి1, జి4, నెం. 103, 104, 303, 402, 403,404 ర్లు ఎనిమిది ఫ్లాట్లున్నూ, నూజివీడు పట్టణములో ఆర్.యస్ నెం.583 రు దాఖలా లే-అవుట్ ప్లాను దాఖలా ప్లాట్ నెం.57రు దాఖలా చ.గ. 150 లున్నూ, యన్.టి.ఆర్ జిల్లా, విస్సన్నపేట సబ్-రిజిస్ట్రారు వారి యిలాకా విస్సన్నపేట మండలం, కొండపర్వ గ్రామములోని ఆర్.యస్.నెం. 325రు దాఖలా య.8-90ట్లున్నూ, కలిగిన ఆస్తులలో బొబ్బిలి కొండలరావు గారికి గల 1/2వ వంతు అవిభక్తపు జాయింటు హక్కును సదరు బొబ్బిలి కొండలరావు గారు వారి జీవితానంతరం నుండి వారి కుమారుడు అయిన బొబ్బిలి వెంకటప్పయ్య గారికి పూర్తి హక్కులుతో చెందులాగున ఒక వీలునామా ను వ్రాయించి సదరు వీలునామాను నోటరి చేయించి రిజిష్టరు చేయ్యకనే ది. 14-03-2023. సం తేదీన స్వర్గస్తులైనారు తెల్పుచు సదరు వీలునామా విచారించి రిజిస్ట్రేషన్ జరిపించవలసినదిగా కోరుతూ ది.14-02-2025 సం.తేదీన ఏలూరు జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రారు కార్యాలయములో దాఖలు చేసినారు. ఇందుపై ఆక్షేపణలు వున్న యెడల 15 రోజులులోగా తెలియపర్చవలెను.

సం/- ఎ. రాఘువరావు
సబ్ రిజిస్ట్రారు, నూజివీడు